


APTEL/2015/65279

# V న్యూస్

మన ఊరు - మన వార్తలు

తెలుగు దినపత్రిక

e-mail : vnewsmachilipatnam@gmail.com
e-mail : vnewsindia@gmail.com

Postal Reg.No. MPM/L22/VNEWS/19-21




సంపుటి : 6 సంచిక : 306 మచిలీపట్నం, విజయవాడ, కాకినాడ, గుంటూరు, ఖమ్మం, వైఎస్ఆర్ కడప, ఒంగోలు, పొట్టి శ్రీరాములు నెల్లూరు 14-05-2020 గురువారం పేజీలు :4 వెల : రూ.3/-

## 3వారాలకోసారి ఆరోగ్యశ్రీ బిల్లుల చెల్లింపు



**(విన్యూస్, అమరావతి) :** రాష్ట్రంలో 108 సర్వీసుల కోసం కొత్తగా కొనుగోలు చేసిన 1,060 వాహనాలను జూలై 1న ప్రారంభిస్తామని ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. టెలీమెడిసిన్ కోసం కొత్త బైకులను కూడా కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. కరోనా నివారణ చర్యలపై తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైద్యారోగ్య శాఖ మంత్రి ఆళ్లనాని, మంత్రి మోపిదేవి వెంకటరమణ, సీఎస్ నీలం సాహ్ని, డీజీపీ గౌతమ్ సవాంగ్, ఇతర ఉన్నతాధికారులతో సీఎం సమీక్షించారు. రాష్ట్రంలో నమోదవుతోన్న కరోనా కేసులు, పరీక్షలు, నియంత్రణ చర్యలపై ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో కరోనా పరీక్షల సంఖ్య 2 లక్షలు దాటిందని అధికారులు సీఎంకు తెలిపారు. ప్రతి 10 లక్షలకు 3,768 పరీక్షలు చేస్తున్నట్లు వివరించారు. కొత్తగా నమోదైన 48 కేసుల్లో 36 పాత క్లస్టర్ల నుంచే వచ్చాయని చెప్పారు. పాజిటివిటీ, మరణాలు, రికవరీ రేటులో దేశం కంటే రాష్ట్రం మెరుగ్గా ఉందని ముఖ్యమంత్రికి నివేదించారు. ఎమర్జెన్సీ సేవలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెప్పారు. షెడ్యూలు సమయానికి వైద్య సిబ్బందే ఫోన్ చేసి వైద్య సేవల కోసం వారిని ఆస్పత్రులకు తరలిస్తున్నారన్నారు.


అనంతరం సీఎం జగన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం కొత్తగా పెట్టిన ఆరోగ్య ఆసరా పథకాన్ని పక్కాగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్యశ్రీ బిల్లులు సకాలంలో అందించే విధంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న ఆరోగ్యశ్రీ బకాయిలన్నింటినీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు చెల్లించామని చెప్పారు. బిల్లులు అప్‌లోడ్ చేసి ప్రతి మూడు వారాలకోసారి మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ విధానంలో ఎక్కడా ఇబ్బందులు రాకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు.

లాక్‌డౌన్‌తో రాష్ట్రంలో వ్యవసాయం, అనుబంధ రంగాల్లో తలెత్తిన సమస్యల పరిష్కార మార్గాలపై సమీక్షించిన సీఎం.. చేపలు, రొయ్యలను రాష్ట్రంలోనే విక్రయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కనీసం 30 శాతం స్థానిక వినియోగం ఉండాలని.. దీనిపై ప్రణాళికలు రూపొందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. అలాగే రైతులు పండించిన ఇతర ఉత్పత్తులకు కూడా కనీసం 30 శాతం స్థానిక వినియోగం ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. చేపల మార్కెటింగ్, ధర విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి మోపిదేవి వెంకటరమణకు సీఎం వివరించారు. రాయలసీమలో ఎక్కువగా ఉత్పత్తి అవుతున్న పండ్లు, టమోటాలకు మరింత మార్కెట్ కల్పించాలని.. కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ యూనిట్లు, గోదాముల నిర్మాణంపై దృష్టి సారించాలని అధికారులకు సీఎం ఆదేశించారు.

## సచివాలయంలో...ఆధిపత్య పోరు?

### -పెద్దాయన దగ్గరకు చేరిన పంచాయితీ??
### -మాజీ వద్దు...తాజా అభ్యర్థి ముద్దు!!
### -ఆయన మాటే వినాలనే హుకుం!!!

**(విన్యూస్, మచిలీపట్నం):** డివిజన్ సచివాలయం పరిధిలో పనులు జరగాలంటే ఆయా సచివాలయంలో పనిచేసే సెక్రటరీలు, వాలంటీర్లు కీలకం. ఆయా వార్డులు, డివిజన్ల పరిధిలోని ప్రజలు వారి వద్దకు వచ్చి పనులు చేయించుకునేందుకు, ప్రజల పనులు సత్వరం పూర్తయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యంగా సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి తీసుకున్న కీలక నిర్ణయాల్లో సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు ఒకటి. అంత వరకు బాగానే ఉంది. పైకి ఎలా ఉన్నా క్షేత్ర స్థాయిలో సచివాలయాల పనితీరుపై సంబందిత డివిజన్ పరిధిలో మాత్రం సచివాలయ వ్యవస్థ అధికార పార్టీ కనుసన్నలోనే నడుస్తోందనే వాదనలు ఉన్నాయి.



### బందర్లో ఒక వ్యక్తి రిపోర్టుపై ఉత్కంఠ

-మూడురోజులుగా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స
-ఆయన కాంటాక్ట్స్‌లో అలజడి
-సదరు రోగిని చేర్పించిన ప్రభుత్వ వైద్యుడు ధీమా
-కొనసాగిస్తున్న ప్రైవేటు హాస్పటల్ ఓపి

**(విన్యూస్, మచిలీపట్నం):** మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో మూడు రోజుల క్రితం చేరిన ఒక వ్యక్తి(రోగి) కరోనా టెస్ట్ రిపోర్టుపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పటి వరకు పాజిటివ్ కేసులు లేని నేపథ్యంలో సదరు వ్యక్తి రిపోర్టు ఎలా వస్తుందనే అంశంపై అటు ప్రభుత్వాసుపత్రిలోనూ ఇటు ప్రజల్లోనూ ఉత్కంఠ నెలకొంది. దీనికి కారణం ప్రభుత్వాసుపత్రిలోనే పనిచేసే ఒక వైద్యుడు సదరు రోగికి తన ప్రైవేటు నర్సింగ్ హోంలో చికిత్స చేసి చివరకు తన వల్ల కాక తన కారులో ప్రభుత్వాసుపత్రిలో చేర్పించినట్లు సమాచారం. సదరు రోగి పరిస్థితిని బట్టి ఆసుపత్రి ఉన్నతాధికారులు రోగి రిపోర్టులు వచ్చేవరకు ప్రభుత్వాసుపత్రికి రావద్దు అని సదరు వైద్యుడికి సెలవు మంజూరు చేసి, పైగా తన ప్రైవేటు డిస్పెన్సరీలో కూడా చికిత్సలు చేయవద్దు అని తెలియజేసినట్లుగా సమాచారం. అయినా సదరు వైద్యుడు యదేచ్ఛగా పట్టణంలో తిరుగుతుండటం, తన డిస్పెన్సరీలో చికిత్సలు చేస్తుండటం గమనార్హం. పైగా అప్పటికే ఢిల్లీవెళ్లి వచ్చారని తెలిసిన టౌన్ వులు కాలనీ వాసులకు కూడా సదరు డాక్టర్ తన సొంత డిస్పెన్సరీలో చికిత్స అందించినట్లుగా సమాచారం. ఈనేపథ్యంలో ప్రస్తుతం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న సదరు రోగి రిపోర్టులు పాజిటివ్ వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో వేరే చెప్పనక్కర్లేదు. సదరు రోగి ఎవరెవర్ని కలిసిన వారు, ఆయన కుటుంబ సభ్యులు, తదితరులను క్వారంటెయిన్ చేయాల్సి ఉంది. అనుమానం ఉన్న వారిని టెస్టులు చేయాల్సి ఉంది. అలాగే గడచిన మూడు నాలుగు రోజులుగా సదరు డాక్టర్ కలిసిన వారిని, ఆయన కుటుంబీకులను, ఆసుపత్రిలో చికిత్స పొందిన వారిని, వారిని కలిసిన వారికి అందర్నీ క్వారంటెయిన్ చేయాల్సి ఉంది. పైగా సదరు డాక్టర్‌పై ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టాల్సి ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అనుమానం గల వ్యక్తుల సమాచారం ప్రభుత్వ వైద్యులకు అందిస్తే ప్రభుత్వాసుపత్రి నుంచి వైద్యుల బృందం సదరు వ్యక్తికి పరీక్షలు నిర్వహించి కరోనా అనుమానాలుంటే ప్రత్యేక దుస్తులు వేసి ప్రత్యేక అబులెన్సులో ప్రభుత్వాసుపత్రికి తీసుకుని వెళ్తారు. కాని ఇవన్నీ తెలిసిన సదరు ప్రభుత్వ వైద్యుడు అప్పటి వరకు తన నర్సింగ్ హోంలో చికిత్సనందించి చివరకు తన కారులో ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చి జాయిన్ చేయించారు. అయితే సదరు డాక్టరు మాత్రం ధీమా ఉన్నట్లుగా సమాచారం. సదరు రోగికి నెగిటివ్ వస్తుందని సవాళ్లు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. అయితే నెగిటివ్ వస్తే సరి అందరకూ మంచిదే కాని పాజిటివ్ అయితే పరిస్థితి ఏమిటో....! బాధ్యత గల వ్యక్తిగా వైద్య రంగంలో ఉన్న వ్యక్తి అందరికీ టెన్షన్ పెట్టడంలో గల ఆంతర్యం ఏమిటో తెలియకుంది...అదీ సంగతి..!!

### ఆ డివిజన్లో మాత్రం భిన్నం..?

మచిలీపట్నంలో ఓ సచివాలయం పరిధిలో మాత్రం అధికార పార్టీలోనే రెండు వర్గాలు ఉన్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఒక వర్గానికి తాజా మాజీ కౌన్సిలర్ , మరో వర్గానికి వాయిదా పడ్డ ఎన్నికల్లో నామినేషన్ వేసిన అభ్యర్థి నాయకత్వం వహిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇరువురు ఒకే పార్టీకి చెందిన వారు కావడం, ఒకరు మొదట్నుంచి వార్డులో ఉన్న వారు కావడం సచివాలయ ఉద్యోగులకు తలనెప్పిగా మారిందనే వాదనలు ఉన్నాయి. మాజీ కౌన్సిలర్ చెప్పిన పనులు చేస్తే తాజా అభ్యర్థికి కోపం వస్తోంది, చేయకపోతే అధికార పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్‌కు కోపం వస్తోందని సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు వాపోతున్నారు. ఇరువురి పనులు చేసినా ఇరువురూ అసంతృప్తితో రగిలిపోతున్నారనే ప్రచారం జరుగుతోంది.

### పెద్దాయన వద్దకు చేరిన పంచాయితీ!

తాజా అభ్యర్థి., మాజీ ప్రజా కౌన్సిలర్ల మధ్య కోల్డ్ వార్ నడుస్తున్న నేపథ్యంలో పంచాయితీ పెద్దాయన వద్దకు చేరినట్లుగా సమాచారం. సచివాలయ ఉద్యోగులందర్నీ పెద్దాయన పిలిపించడంతోనే వారంతా సచివాలయానికి తాళాలు వేసి మరీ వెళ్లినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఎవరు ఏం చెప్పినా చేయవద్దని, నామినేషన్ వేసిన అభ్యర్థి గెలుపు తథ్యమని, ఆయన చెప్పిన రీతిలోనే నడవాలని, అటువంటి వారే ఉద్యోగాల్లో ఉండాలని పెద్దాయన స్పష్టం చేసినట్లుగా సమాచారం. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సదరు పంచాయితీ జరిగినట్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఇవేం తెలియక, ఏం జరిగిందో తెలియక సచివాలయానికి వచ్చిన ప్రజలు మాత్రం ఎండలో తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అదీ సంగతి...సచివాలయానికి తాళం వెనక సంగతి...!

## చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు పూచీకత్తు లేని రుణాలు:

### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**(డిల్లీ) :** కరోనా సంక్షోభంతో తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.3లక్షల కోట్లు రుణాలుగా ఇవ్వనున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. కరోనా సంక్షోభంతో కుదేలైన దేశ ఆర్థిక వ్యవస్థకు పునరుజ్జీవం పోసేలా ప్రధాని మోదీ ప్రకటించిన రూ.20 లక్షల కోట్ల భారీ ఆర్థిక ప్యాకేజీ వివరాలను ఆమె వెల్లడించారు. బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. “సూక్ష్మ, మధ్య, లఘు, కుటీర పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ)కు రూ.3లక్షల కోట్లు ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణాలిస్తాం. 12 నెలల మారటోరియంతో ఈ రుణాలు మంజూరుచేస్తాం. ఎంఎస్ఎంఈలకు ఆరు అంశాల్లో ఆర్థిక ప్యాకేజీతో ప్రయోజనం కలుగుతుంది. ఆర్థిక ప్యాకేజీకి సంబంధించిన వివరాలను ఇవాళ్టి నుంచి ఒక్కొక్కటిగా వివరాలను ప్రకటిస్తాం. రూ.5లక్షల లోపు ఆదాయ పన్ను రీఫండ్ బకాయిలు వెనక్కి చెల్లించాం. భారత్ స్వయం శక్తితో ఎదగాలనేదే మా లక్ష్యం” అని అన్నారు.

**ఉద్యోగుల భద్రతకు తోడ్పాటు**

“ఈ ఆర్థిక ప్యాకేజీలో భాగంగా 15 అంశాల్లో కేటాయింపులు చేస్తాం. ఉత్పత్తి సామర్థ్యాల పెంపు కోసం రూ.10వేల కోట్లతో ఫండ్ ఏర్పాటు. ఎంఎస్ఎంఈలకు ఆరు అంశాల్లో ఆర్థిక ప్యాకేజీతో ప్రయోజనం చేకూరనుంది. ఎంఎస్ఎంఈలు తక్షణం ఉత్పత్తి ప్రారంభించేందుకు ఇది దోహదపడుతుంది. ఉద్యోగుల భద్రత కల్పించేందుకు ఉపయోగపడుతుంది. అన్ని విభాగాల్లోనూ నగదు లభ్యతే ప్రధాన సమస్యగా ఉంది. తీవ్రమైన రుణ ఒత్తిడిలో ఉన్న ఎంఎస్ఎంఈలకు రూ.20వేల కోట్లు, ఎంఎస్ఎంఈల్లో ఈక్విటీ పెట్టుబడుల కోసం రూ.50వేల కోట్లు కేటాయింపు. ఈ ప్యాకేజీతో రెండు లక్షల చిన్న తరహా పరిశ్రమలకు ప్రయోజనం కలగనుంది. ఎంఎస్ఎంఈల నిర్వచనంపై కొంత అయోమయం ఉంది. ఇప్పుడు మేలు చేసేలా కొత్త నిర్వచనం ఇస్తున్నాం” అని నిర్మల పేర్కొన్నారు.

**నవభారత్ నిర్మాణమే మూల సూత్రంగా..**

“ప్రధాని ఒక సమగ్రమైన దార్శనికతను దేశం ముందుంచారు. దేశ ఆర్థిక వృద్ధిని పెంచి స్వయం సమృద్ధి భారతే లక్ష్యంగా ఈ ప్యాకేజీ ప్రకటించారు. ఆర్థిక, మౌలిక సదుపాయాలు, సాంకేతికత, జనాభా, డిమాండ్ అనే ఐదు మూల సూత్రాలుగా ఈ ప్యాకేజీ ఉంటుంది. స్థానిక ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తం చేయడమే లక్ష్యం. గత 40 రోజుల్లో మన శక్తి ఏమిటో ప్రపంచానికి తెలిసింది. పీపీఈ కిట్లు, మాస్కుల తయారీలో ఎంతో ప్రగతి సాధించాం. నవ భారత్ నిర్మాణమే ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్ మూల సూత్రం” అని తెలిపారు.

**పెట్టుబడి పరిమితి రూ.కోటికి పెంపు**

ప్రధాని నరేంద్ర మోదీ నిన్న ప్రకటించిన ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్ ప్యాకేజీ వివరాలను ప్రకటించిన సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. “సూక్ష్మ పరిశ్రమల పెట్టుబడి పరిధిని రూ.25లక్షల నుంచి రూ.కోటికి పెంచుతున్నట్టు తెలిపారు. రూ.5కోట్ల టర్నోవర్ చేసే కంపెనీలు కూడా సూక్ష్మ పరిశ్రమలుగా గుర్తింపు. ఎన్‌బీఎఫ్‌సీలకు రూ.30 వేల కోట్ల మేర నగదు లభ్యత కల్పిస్తాం. ఎన్‌బీఎఫ్‌సీలకు 45వేల కోట్లు పాక్షిక క్రెడిట్ గ్యారెంటీ ఇస్తాం. తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న డిస్కంలకు రూ.90వేల కోట్ల మేర నగదు లభ్యత కల్పిస్తాం. కరోనా తర్వాత వాణిజ్య ప్రదర్శనల నిర్వహణకు చాలా కష్టంగా ఉంటుంది. ప్రభుత్వ కొనుగోళ్లలో ఈ మార్పు ఎంఎస్ఎంఈలకు ఎంతో మేలు జరుగుతుంది” అన్నారు.

**విద్యుత్ పంపిణీ సంస్థలకు రూ.90వేల కోట్లు**

“విద్యుత్ పంపిణీ సంస్థలకు రూ.90వేల కోట్లు కేటాయింపు చేశాం. కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీల ఒప్పంద పనుల పూర్తికి ఆరు నెలలు అదనపు సమయం ఇస్తున్నాం. నిర్మాణ, సేవల ఒప్పందాలకు సంబంధించి ఈ వెసులుబాటు కల్పిస్తున్నాం. కేంద్ర ఏజెన్సీలు, కాంట్రాక్టర్ల బ్యాంకు గ్యారంటీలను పాక్షికంగా విడుదల చేస్తున్నాం” అని తెలిపారు.

**ఆత్మ నిర్భర్ భారత్‌తో ప్రజలకు కొత్త ఉత్తేజం**

“గడిచిన ఐదేళ్లలో ఎన్నో విధాలుగా సంస్కరణల్ని అమలు చేశాం. ప్రత్యక్ష నగదు బదిలీ మా సంస్కరణలకు మేలిమి ఉదాహరణ. భూమి, నగదు లభ్యత, పాలనాపరమైన విధానాలే కీలకం. డీబీటీ, సూక్ష్మస్థాయి బీమాలతో ప్రజలకు ఎతో మేలు జరుగుతుంది. స్వచ్ఛభారత్ అభియాన్, ఆయుష్మాన్ భారత్ మేం చేపట్టిన కీలక పథకాలు. ఎఫ్‌డీఐ నిబంధనలకు సరళీకరించి పెట్టుబడులకు మార్గం సుగమమం చేశాం. తాజాగా ప్రధాని ప్రకటించిన ఆత్మ నిర్భర్ భారత్ నినాదం దేశ ప్రజలకు కొత్త ఉత్తేజం ఇస్తుంది. కరోనా కష్టాల నుంచి పేదలకు ఉపశమనం కోసం గరీబ్ కల్యాణ్ యోజన అమలు చేస్తున్నాం” అన్నారు.

## వలస కార్మికులకు స్వదేశానికి రప్పించేందుకు ఏర్పాటు చేయాలని


### కేంద్ర విదేశాంగ శాఖా మంత్రికి సీఎం జగన్ విజ్ఞప్తి

**(విన్యూస్, అమరావతి) :** కువైట్‌లో చిక్కుకుపోయిన ఆంధ్రప్రశ్‌కు చెందిన వలస కార్మికులును స్వదేశానికి రప్పించేందుకు అవసరమైన విమాన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర విదేశాంగ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బుధవారం కేంద్ర మంత్రికి లేఖ రాశారు. ఈ సందర్భంగా వలస కార్మికుల కోసం విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి నుంచి నేరుగా విమానాలు ఏర్పాటు చేయాలని లేఖలో కోరారు. అదే విధంగా విదేశాల్లో చిక్కుకుపోయిన భారతీయలను వెనక్కి రప్పించేందుకు ‘వందే భారత్’ మిషన్ పేరుతో కేంద్రం చేపడుతున్న చర్యలు ప్రశంసనీయమన్నారు. ఇతర దేశాల్లో చిక్కుకుపోయిన వేలాది మంది భారతీయులు వందే భారత్ మిషన్‌ను సద్వినియోగం చేసుకుని సొంత ఖర్చులతో స్వదేశానికి తిరిగి వస్తున్నారన్నారు. ఈ క్రమంలో గల్ఫ్ దేశాల్లో ఉపాధి కోల్పోయి, అక్కడే చిక్కుకుపోయిన వేలాది వలస కార్మికులు కూడా స్వదేశానికి తిరిగి రావడానికి ఎంతో ఆశతో చూస్తున్నారని, అయితే వారంతా స్వదేశానికి రావడానికి అయ్యే ప్రయాణ ఖర్చు భరించే స్థితిలో లేరని ముఖ్యమంత్రి తెలిపారు. గల్ఫ్ దేశాల్లో ఆమ్నెస్టీ ద్వారా స్వదేశాలకు వెళ్లడానికి అనుమతి పొందిన సుమారు 2500 మంది వలస కూలీలు వారి ప్రయాణ ఛార్జీలకు కూడా డబ్బులు లేని స్థితిలో ఉన్నారని లేఖలో పేర్కొన్నారు.

ఇమ్మిగ్రేషన్ రుసుము మాఫీ చేయడం ద్వారా మన దేశ రాయబార కార్యాలయం, వారందరికీ ఎగ్జిట్ క్లియరెన్స్ కూడా ఇచ్చిందని, మరోవైపు వారి ప్రయాణ ఖర్చును భరించడానికి కువైట్ ప్రభుత్వం కూడా సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రస్తుతం వారంతా అక్కడ స్థానికంగా ఏర్పాటు చేసిన శిబిరాల్లో తలదాచుకుంటున్నారని, అరకొర భోజన వసతి, కనీస సదుపాయాలు కూడా లేకుండా రెండు వారాల నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతూ, స్వదేశానికి తిరిగి రావాలని ఆశతో ఎదురు చూస్తున్నారని వైఎస్ జగన్ లేఖలో తెలిపారు.

## వ్యవస్థలను నిర్వీర్యం చేశారు: చంద్రబాబు

**(విన్యూస్, హైదరాబాద్) :** తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు మరోసారి వైకాపా ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తమ ప్రభుత్వం రాష్ట్రంలో వ్యవస్థలను నిర్మిస్తే ఏడాదిలోనే వైకాపా ప్రభుత్వం వాటిని ధ్వంసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం చంద్రబాబు పార్టీ సభ్యులతో పొలిట్ బ్యూరో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో విద్యుత్ బిల్లులు 4రెట్లు పెరగడంతో పేదలు ఆవేదన చెందుతున్నారన్నారు. మరోవైపు రైతులకు గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు అసమర్థులైతే ప్రజలు తీవ్రంగా నష్టపోతారని చంద్రబాబు విమర్శించారు. మద్యం దుకాణాలు తెరవడం వల్ల ఏపీలో సమస్యలు మరింత పెరిగాయని చంద్రబాబు మండిపడ్డారు. గుంపులుగా చేరడం వల్ల కరోనా కేసులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం ధరలు పెంచి, నాసిరకం బ్రాండ్లతో ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నారని ఆక్షేపించారు. జూన్, జులై నెలల్లో కరోనా కేసులు మరింత పెరుగుతాయనే అంచనాలు ఆందోళనలు కలిగిస్తున్నాయని చంద్రబాబు వ్యాఖ్యాలు చేశారు.



కరోనా వైరస్ విజృంభిస్తోన్న నేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రధాని మోదీ రూ.20లక్షల కోట్ల ఆర్థిక ప్యాకేజీ ప్రకటించటం పట్ల చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. కరోనా కట్టడిలో భాగంగా ప్రధాని మోదీ దేశంలో లాక్‌డౌన్‌ను పటిష్ఠంగా అమలు చేశారని కితాబిచ్చారు. అయితే నిబంధనల అమల్లోనే కొన్ని రాష్ట్రాల్లో పొరపాట్లు జరిగాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## భారత్‌లో 74వేల కేసులు, 2415 మరణాలు!

**(దిల్లీ):** దేశంలో కరోనా వైరస్ విజృంభణ కొనసాగుతూనే ఉంది. గడచిన 24గంటల్లో దేశవ్యాప్తంగా కొత్తగా 3525 పాజిటివ్ కేసులు నిర్ధారణ అయ్యాయి. మరో 122 మరణాలు సంభవించాయి. దీంతో దేశంలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 74,281కి చేరగా 2415 మంది మృతిచెందారని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. మొత్తం బాధితుల్లో ఇప్పటివరకు 24,386 మంది కోలుకోగా మరో 47,480 మంది చికిత్స పొందుతున్నారని ప్రకటించింది. ఇక గుజరాత్‌లో 8903 పాజిటివ్ కేసులు నమోదుకాగా 537 మంది ప్రాణాలు కోల్పోయారు. దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ నిబంధనలు సడలించడం, భారీ సంఖ్యలో వలస కార్మికులు వారి స్వస్థలాలకు తరలివెళ్తుండడంతో ఆయా రాష్ట్రాల్లో వైరస్ తీవ్రత పెరుగుతోంది.

**మహారాష్ట్రలో కొనసాగుతున్న కొవిడ్-19 ఉద్ధృతి..**

మహారాష్ట్రలో వైరస్ తీవ్రత కొనసాగుతూనే ఉంది. తాజాగా రాష్ట్రంలో కేసుల సంఖ్య 24,427కు చేరగా 921 మంది మృత్యువాతపడ్డారు. కేవలం ఒక్క ముంబయి నగరంలోనే పాజిటివ్ కేసుల సంఖ్య 15వేలు దాటింది. మహారాష్ట్ర నుంచి వివిధ రాష్ట్రాలకు వెళుతున్న వారిలో ఎక్కువ



పాజిటివ్ కేసులు బయటపడటం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే రాష్ట్రం నుంచి 35 ప్రత్యేక రైళ్ల ద్వారా 42వేల మంది వలస కార్మికులను వారి స్వస్థలాలకు పంపించారు.

**ఒకే ఆసుపత్రిలో 106 మంది సిబ్బందికి పాజిటివ్..**

దిల్లీలోనూ కరోనా విజృంభణ కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే నగరంలో చాలా మంది వైద్యులు, వైద్య సిబ్బంది ఈ వైరస్ బారినపడ్డారు. తాజాగా నగరంలోని బాబాసాహెబ్ ఆసుపత్రిలోని 106మంది వైద్య సిబ్బందికి కరోనా పాజిటివ్ అని తేలింది. దిల్లీలో ఒకే ఆసుపత్రిలో ఇంతమందికి వైరస్ సోకడం ఇదే తొలిసారి. ఇక కరోనా వైరస్ సోకిన ఆర్మీ జవాన్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోవడం దిల్లీలో కలకలం రేపింది.ఒడిషాలో ఒకేరోజు 100పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 437కి చేరింది.

## ఏపీలో 2137కి చేరిన కరోనా కేసులు

**(విన్యూస్, అమరావతి) :** ఆంధ్రప్రదేశ్‌లో కరోనా వ్యాప్తి కొనసాగుతోంది. గడిచిన 24 గంటల్లో నిర్వహించిన కొవిడ్ పరీక్షల్లో 48 పాజిటివ్ కేసులు నిర్ధారణ అయినట్టు వైద్య ఆరోగ్యశాఖ బులిటెన్‌లో తెలిపింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు నమోదైన పాజిటివ్ కేసుల సంఖ్య 2137కి చేరింది. ప్రస్తుతం వివిధ కొవిడ్ ఆసుపత్రుల్లో 948 మంది చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు కరోనా నుంచి 1142 మంది డిశ్చార్జి అయ్యారు. మృతుల సంఖ్య 47కి చేరింది. ఇవాళ నమోదైన కేసుల్లో అత్యధికంగా గుంటూరు జిల్లాలో 12 కేసులు ఉన్నాయి. గుంటూరు నుంచి కోయంబేడు మార్కెట్ కు వెళ్లిన వారికే కరోనా వైరస్ సోకినట్లు అధికారులు గుర్తించారు. కోయంబేడు మార్కెట్‌కు వెళ్లిన 140 మందిని ఇప్పటికే గుర్తించారు. వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు అధికారులు వెల్లడించారు.

## భారత్‌కు ఎన్‌డీబీ బ్యాంకు 1 బిలియన్ డాలర్ల రుణ సహాయం




**(షాంఘై):** కరోనా వైరస్ నియంత్రణ కోసం భారత ప్రభుత్వం చేస్తోన్న పోరాటానికి రుణ సహాయం అందించి బ్రిక్స్ న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు మద్దతుగా నిలిచింది. ఎమర్జెన్సీ అసిస్టెంట్ ప్రొగ్రామ్ లోన్ కింద 1 బిలియన్ డాలర్ల(సుమారు రూ.7,500 కోట్లు)రుణ సహాయం అందించినట్లు మీడియా ప్రకటన ద్వారా బ్యాంకు వెల్లడించింది. ఏప్రిల్ 30, 2020న ఆ బ్యాంకు డైరెక్టర్ల నుంచి ఆమోద ముద్ర లభించింది. వైరస్ విజృంభణ వల్ల కలిగిన సామాజిక, ఆర్థిక నష్టాలను తగ్గించడానికి ఈ రుణం దోహదపడనుంది.

‘విపత్తు సమయంలో సభ్య దేశాలకు సహకరించడానికి ఎన్‌డీబీ కట్టుబడి ఉంది. కొవిడ్-19 కట్టడిలో భారత ప్రభుత్వం అభ్యర్థన, తక్షణ ఆర్థిక అవసరాలకు స్పందనగా ఎమర్జెన్సీ అసిస్టెంట్ ప్రొగ్రాం లోన్ ఆమోదించాం’ అని బ్యాంకు ఉపాధ్యక్షుడు, సీఓఓ గ్జియాన్ ఝు వెల్లడించారు. వైద్య రంగం అత్యవసర ప్రతిస్పందన, జనవరి 1, 2020 నుంచి సామాజిక బలోపేతం కోసం ఇప్పటి వరకు చేసిన ఖర్చులు, అలాగే మార్చి 1, 2021 వరకు కొవిడ్ 19 కట్టడిలో భాగంగా సామాజిక భద్రతకు అయ్యే వ్యయం ఈ ప్రొగ్రామ్ పరిధిలోకి వస్తాయి. సభ్య దేశాల సహాయార్థం బ్యాంకు తీసుకున్న చర్యలను ఎన్‌డీబీ బోర్డు ఆఫ్ గవర్నర్స్ స్వాగతించింది. అలాగే ఏప్రిల్ 20, 2020న జరిగిన ఐదో వార్షిక సమావేశంలో కొవిడ్-19తో జరిపే పోరాటంలో బ్రిక్స్ దేశాలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని సూచించింది. ఎన్‌డీబీ బ్యాంకును బ్రిక్స్ డెవలప్‌మెంట్ బ్యాంకు అని కూడా అంటారు. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా దేశాలు కలిసి దీన్ని ఏర్పాటు చేశాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం, స్థిరమైన అభివృద్ధి ప్రాజెక్టుల కోసం నిధులు సమీకరించడం దీని ముఖ్య లక్ష్యాలు.

# విపత్తులు నేర్పుతున్న పాఠాలు

కరోనా మహమ్మారి విద్యారంగాన్నీ వణికిస్తోంది.... తక్షణం కొత్త పద్ధతులను అందిపుచ్చుకుంటే తప్ప మనలేని అనివార్యతను ముందుకు తెచ్చింది. బోధన అనగానే తరగతి గదుల్లో పదుల సంఖ్యలో కూర్చున్న విద్యార్థులను ఉద్దేశించి పాఠం చెప్పడమే అన్న అభిప్రాయం స్థిరపడింది. చాక్ పీస్, బ్లాక్ బోర్డు లేనిదే తరగతులు అసంభవమని, కాగితాలు కలాలు లేనిదే పరీక్షల నిర్వహణ అసాధ్యమని చాలామందికి ఓ బలమైన అభిప్రాయం ఉంది. రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న విద్యా సాంకేతికత సాయంతో భౌతికంగా ఎదురుపడకుండానే విద్యార్థులకు నిశ్చింతగా పాఠాలు చెప్పొచ్చు, పరీక్షలు సైతం పెట్టవచ్చు. అభివృద్ధి చెందిన దేశాల్లో దశాబ్దాలుగా ఆధునిక విధానాలను అనుసరిస్తున్నారు. భారత్‌లోనూ కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు సాంకేతికతను అందిపుచ్చుకుని వెబ్‌సెట్లు, అంతర్జాల అప్లికేషన్ల తోడ్పాటుతో తరగతులు నిర్వహించడంతోపాటు పరీక్షలూ పెడుతుండటం విశేషం.

పరీక్షలు అనగానే బోధనరంగంలోని వారికి తెలిసిన ఒకే ఒక పద్ధతి... ప్రశ్నపత్రం ఇస్తే జవాబులు రాయడం! కాలానుగుణంగా అనేక కొత్త విధానాలు అందుబాటులోకి వచ్చిన విషయాన్ని మనదేశంలో ఇంకా గుర్తించాల్సి ఉంది. 'ఓపెన్ బుక్ పరీక్షలు' సైతం ఉంటాయని, అవసరమైతే వాటిని కూడా 'క్లోజ్డ్ బుక్ ఎగ్జామ్స్' కంటే కఠినంగా నిర్వహించవచ్చునన్న విషయాన్నీ అధ్యాపకులు, ఉపాధ్యాయులు గమనించాలి. కానీ, సాంకేతిక పరిజ్ఞానాన్ని కేవలం ప్రైవేటు రంగం మాత్రమే అందిపుచ్చుకుని నూతన విధానాలను వేగంగా అమలు చేయడానికి పలు కారణాలున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో చదువుకొనే విద్యార్థులకు కొత్త సాంకేతిక విధానాలతో మిళితమైన బోధన, పరీక్ష పద్ధతులను పరిచయం చేయాల్సి ఉంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇంట్లోంచే పాఠాలు వినాలంటే కంప్యూటర్, ట్యాబ్ లేదా అంతర్జాల సదుపాయం ఉన్న చరవాణి ఉండాల్సిందే! మరీ ముఖ్యంగా కావలసినంత అంతర్జాల డేటా సైతం తప్పనిసరి. ఈ వసతులు ఇప్పటికే సమకూరి ఉంటే– ప్రభుత్వ విద్యా సంస్థల్లోనివారూ ఇంట్లోంచే విద్యాభ్యాసం చేయగలిగేవారు. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలోనైనా ప్రభుత్వాలు విద్యార్థుల సర్వతోముఖ వికాసంపై దృష్టి పెట్టాలి. అభివృద్ధి చెందిన దేశాలు గడచిన పాతిక, ముప్ఫై ఏళ్లుగా విద్యారంగాన్ని సాంకేతిక హంగులతో పరిపుష్టం చేసుకుంటున్నాయి. పాఠశాలస్థాయినుంచి విశ్వవిద్యాలయాల వరకు నూతన పరిశోధనలు చేస్తూ విద్యార్థులకు మెరుగైన బోధనలు, విజ్ఞానం అందిస్తూ అభివృద్ధి పథంలో దూసుకెళుతున్నాయి. భారత్‌లో ఇప్పటికీ విద్యావ్యవస్థలో కనీస స్థాయి సాంకేతికతను ప్రవేశపెట్టేందుకు మీనమేషాలు లెక్కిస్తున్న పరిస్థితి ఉంది. ఇప్పటికీ నల్లబల్లపై చాక్‌పీసులతోనే పాఠాలు చెబుతున్నారు. అరుదుగా తప్ప 'ఎల్‌సీడీ ప్రొజెక్టర్'ను ఉపయోగించడం లేదు. ఇలాంటి పద్ధతులు ఉపాధ్యాయుల, విద్యార్థుల నిష్పత్తి తక్కువగా ఉన్నట్లయితే మంచి ఫలితాలు ఇవ్వవచ్చు. అలాకాకుండా ఒకవైపు విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచుతూ, ఉపాధ్యాయ అధ్యాపక నియామకాలకు మరోవైపు పెద్దయెత్తున కోతపెడుతూ సాంకేతికతతో నిమిత్తం లేకుండా విద్యారంగాన్ని ముందుకు తీసుకువెళ్ళాలనుకోవడమే అసలు సమస్య. వివిధ ప్రయత్నాలతో ఈ విద్యా సంవత్సరాన్ని ఏదో రకంగా గట్టెక్కించినా– వచ్చే ఏడాదికి మాత్రం కొన్ని కీలకాంశాలను దృష్టిలో పెట్టుకొని పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాల్సి ఉంది.

ప్రాథమిక విద్య మొదలు విశ్వవిద్యాలయాల దాకా బోధన రంగంలోని అధ్యాపకులందరికీ అంతర్జాలం ద్వారా బోధనగరపడం, సమగ్రమైన ఎలెక్ట్రానిక్ సమాచార నిధిని సిద్ధం చేయడంబీ అంతర్జాలంలోనే మూల్యాంకనం నిర్వహించడం వంటివాటిపై వీడియో సమావేశాలు, ప్రత్యేక కార్యశాలల ద్వారా శిక్షణ ఇవ్వాలి. మరోవంక విశ్వవిద్యాయాలు సైతం విద్యార్థులకు అంతర్జాలం ద్వారా చదువు నేర్చుకోవడానికి అవసరమైన మెళకువలు నేర్పించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్‌తో పాటు ల్యాప్‌టాప్‌గానీ, 'ట్యాబ్'గానీ ఇవ్వాలి. భౌతిక దూరం తప్పనిసరి అయితే ఇకపై నిర్మించే తరగతి గదులను ఇప్పుడున్నవాటికంటే మూడు నాలుగు రెట్లు ఎక్కువ వైశాల్యంతో నిర్మించడంపైనా దృష్టి పెట్టాలి. సంస్థలో చదువుకునే విద్యార్థులందరినీ ఒకే రోజు రప్పించకుండా, సగం సగం చొప్పున రోజు విడిచి రోజు తరగతులకు హాజరయ్యే విధంగా ప్రణాళికలు రచించాలి. అభివృద్ధి చెందిన దేశాల్లో వారానికి నాలుగు నుంచి అయిదు రోజులే ప్రత్యక్ష బోధనగరిపి, మిగిలిన రోజుల్లో విద్యార్థులకు స్వయంగా చదువుకునే పరిస్థితులు కల్పిస్తారు. దురదృష్టవశాత్తు భారత్‌లో ప్రత్యక్ష బోధననే ప్రామాణికంగా చూస్తున్నారు. అవసరానికి మించి బోధన గంటలు పెంచి విద్యార్థుల్లోని సృజనాత్మకతను దెబ్బతీస్తున్నారు. భవిష్యత్తులో ఉపాధ్యాయులను తయారు చేసే బీఈడీ, ఎంఈడీ వంటి కోర్సుల్లో సాంకేతిక విజ్ఞాన అవసరాన్ని చాలినంతగా చెప్పడం లేదు. ఇకమీదటైనా పాఠ్యప్రణాళికలో మూడు నాలుగు పాఠ్యాంశాలను అంతర్జాల ఆధారిత వైవిధ్య కోర్సులకు కేటాయించి, భావి ఉపాధ్యాయులను సాంకేతికంగా సన్నద్ధం చేయాలి. ఉపాధ్యాయ, అధ్యాపక నియామకాల్లో సాంకేతిక రంగంలో అవగాహన ఉన్నవారికి ప్రాధాన్యమివ్వాలి.

అధ్యాపకుల శిక్షణ, పునశ్చరణ కార్యశాలల్లో సింహభాగాన్ని విద్యా సాంకేతికత కోసం కేటాయించాలి. ప్రతి విశ్వవిద్యాలయం పరిధిలో ఎలక్ట్రానిక్ అభ్యసన కేంద్రాన్ని, స్టూడియోను నిర్మిస్తే దానితోపాటు ఆ పరిధిలోని అన్ని విద్యా సంస్థల అవసరాలను తీర్చేందుకు ఆ మౌలిక సౌకర్యాలు అక్కరకొస్తాయి. సాధ్యమైనంతవరకు విశ్వవిద్యాలయాల ప్రవేశపరీక్షలను, అడ్మిషన్లను ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలి. మరోవంక విద్యాసంస్థలు పారిశుద్ధ్యంపై శ్రద్ధ పెట్టి విద్యార్థులకు అంటువ్యాధులపై అవగాహన కల్పించాలి. డిగ్రీ, పీజీ స్థాయిల్లో విపత్తు నిర్వహణ, ప్రజారోగ్యం, సుస్థిరాభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక కోర్సులను ప్రారంభించాలి. ప్రభుత్వాలు, విద్యాయంత్రాంగం ప్రస్తుతం సానుకూల దృక్పథంతో పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే గూగుల్, జూమ్, వెబెక్స్ వంటి అప్లికేషన్ల సాయంతో తరగతులు నిర్వహిస్తున్న తీరు చూస్తున్నాం. స్వయం, స్వయం ప్రభ, ఇ–పాఠశాల, ఇ–పీజీ పాఠశాల వంటి కార్యక్రమాలను ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నా మన విద్యాసంస్థలు వాటిని సమర్థంగా ఉపయోగించుకోలేకపోతున్నాయి. ప్రశ్నకు సమాధానం చెప్పే దిశలోనే కాకుండా– ప్రశ్నను నిర్మించే స్థాయికి విద్యార్థులను తీర్చిదిద్దేలా బోధన ఉండాలి. విద్యా సాంకేతికతలో ఇన్నేళ్ల వెనకబాటుకు ఇప్పుడు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది.

# భారీ మొత్తంలో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న చాట్రాయి పోలీసులు

## 192 మాంద్యం బాటిళ్లు, 8 మంది వ్యక్తులు, 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



**(విన్యూస్, మచిలీపట్నం) :** లాక్ డౌన్ సందర్భాన మద్య విధానంలో మార్పులు చోటుచేసుకున్న తరుణంలో పొరుగు రాష్ట్రాల నుండి జిల్లాకు అక్రమ మద్యం సరఫరా అవుతున్న నేపథ్యంలో దానిని కట్టడి చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్న జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్ బాబు ఐపీఎస్ ఆదేశాల మేరకు బుధవారం చాట్రాయి ఎస్సై కె. శివ నారాయణ తన సిబ్బందితో కలిసి జిల్లాలో తెలంగాణ సరిహద్దు ప్రాంతాల నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం రాయలపై చాట్రాయి ఎస్ ఐఉక్కు పాదం మోపారు. మద్యం రాయుళ్లు ప్రధాన రహదారుల వెంబడి రాకుండా డొంక రోడ్ల గుండా,అక్రమ మద్యాన్ని తరలిస్తున్నారన్న విషయాన్ని గ్రహించిన ఎస్ఐ గత మూడు రోజులుగా పథకం వేసి కాపు కాసి మరీ అక్రమ మద్యాన్ని నిలువరించారు. చాట్రాయి పోలీస్ స్టేషన్ పరిధిలో కందుకూరు రోడ్డు, గుడిపాడు ప్రాంతాలలో వాహనాల తనిఖీ చేపట్టారు తెలంగాణ రాష్ట్రం నుండి జిల్లాకు ద్విచక్రవాహనంపై తరలిస్తున్న 192 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, 8 మంది వ్యక్తులను, 5 ద్విచక్ర వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. వారిపై ఎక్సైజ్ కేసులు నమోదు చేశారు.

# పేదలను ఆదుకోవాలనే లక్ష్యంతో నిత్యావసర సరుకులు, ఫ్రూట్స్, గుడ్లు, బ్రెడ్స్ పంపిణీ



**(విన్యూస్, మచిలీపట్నం) :** కరోనా మహమ్మారిని నిర్మూలించేందుకు ప్రభుత్వం విధించిన లాక్ డౌన్ వల్ల పనుల్లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలను ఆదుకోవాలనే లక్ష్యంతో నిత్యావసర సరుకులు, ఫ్రూట్స్, గుడ్లు, బ్రెడ్స్ పంపిణీ చేస్తున్నట్లు సిఆర్ఆర్ ఉమెన్స్ కళాశాల కరస్పాండెంట్ పాలడుగు శ్రీరంగం, రమాదేవి దంపతులు తెలిపారు. నగరంలోని కట్టా సుబ్బారావు తోటలో ఉన్న అవతార్ మెహర్ బాబా సెంటర్ వద్ద నాలుగు వందల మంది పేదలకు వారు సహాయం అందజేశారు. శ్రీరంగం, రమాదేవి దంపతుల కుమార్తె పాలడుగు సాయి సుధ అమెరికాలో స్థిరపడ్డారు. ఆమె అమెరికాలోని బృహత్తర వాషింగ్టన్ తెలుగు సాంస్కృతిక సంఘానికి అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. సాయిసుధ చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఏలూరులో ఉంటున్న ఆమె తల్లిదండ్రుల చేత పేదలకు సహాయ సహకారాలు అందజేస్తున్నారు. పాలడుగు శ్రీరంగం మాట్లాడుతూ కరోనా మహమ్మారి ప్రజల జీవితాలను దుర్భరంగా మార్చిందన్నారు. ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు తమ వంతు సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే సిఆర్ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన క్వారంటైన్ లో ఉంటున్న వారికి అల్పాహారం, భోజన సౌకర్యం కోసం 40 వేల రూపాయలను కళాశాల కార్యదర్శికి అందజేసినట్లు చెప్పారు. కట్టా సుబ్బారావు తోట సంక్షేమ సంఘం నాయకులు సత్యవాడ దుర్గాప్రసాద్(టక్ ప్రసాద్) మాట్లాడుతూ కరోనా వైరస్ ను అంతం చేసేందుకు విధించిన లాక్ డౌన్ వల్ల ఉపాధి కోల్పోయిన ప్రజలను ఆదుకునేందుకు అనేక స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయన్నారు. సమాజ సేవే మాధవ సేవగా భావించి ఈ కష్టకాలంలో పేదలను ఆదుకునేందుకు ముందుకు రావాలని దాతలకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కట్టా సుబ్బారావు తోట సంక్షేమ సంఘం నాయకులు వేమూరి శ్రీధర్, గుండపనేని గోవర్ధన్, కనకల దంతేశ్వరరావు ఇతరులు పాల్గొన్నారు.

# మాస్కులు లేకుంటే కఠిన చర్యలు తప్పవు - ఎస్సై తిరుపాల్ నాయక్




**(విన్యూస్, పులివెందుల) :** కరోనా వైరస్ వ్యాప్తి నివారణలో భాగంగా వేంపల్లి ఎస్సై తిరుపాల్ నాయక్ ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మాస్కులు లేకుండా బయటకు వస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ లాక్‌డౌన్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, అనవసరంగా రోడ్లపై తిరగవద్దని, అత్యవసర పరిస్థితుల్లో బయటికి వచ్చినప్పుడు మాస్కులు ధరించాలని ప్రజలను ఆయన సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం ప్రజలు బయటకు రావద్దని, కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు వేంపల్లె పట్టణం ప్రజలు సహకరించాలన్నారు.

# కరోనా కష్టాలకు తోడు కరెంట్ కష్టాలు



**(విన్యూస్, మచిలీపట్నం) :** కరోనా కష్టాలకు తోడు కరెంట్ కష్టాలు ప్రజలను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నాయి అని పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు వైసీపీ ప్రభుత్వాని విమర్శించారు. బుధవారం మచిలీపట్నం లోని ఎలక్ట్రికల్ డివిజనల్ ఇంజినీర్ ఏ. శ్రీనివాస బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ విద్యుత్ బిల్లులు 30 రోజులకు మాత్రమే యూనిట్లు విభజించి, రెండు నెలలకు విడివిడిగా బిల్లు తీసి పాత శ్లాబు విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ కష్టకాలంలో కరెంటు చార్జీలు పెంచుతున్నట్లు విద్యుత్ సంస్థలు ముందుగా ప్రకటించకుండా అమల్లోకి తేవడం సరికాదు అన్నారు. కరోనా లాక్ డౌన్ వల్ల ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ప్రజలపై విద్యుత్ చార్జీలు పిడుగులా పడ్డాయి అన్నారు. మే నెలలో 5వ తేదీ నుంచి 15 వరకూ గత రెండు నెలల రీడింగ్ తీయటం వల్ల యూనిట్ల సంఖ్య అమాంతంగా పెరిగిపోవడంతో కేటగిరీలు మారి బిల్లులు రెట్టింపు పైగా వచ్చాయి అన్నారు. విద్యుత్ చార్జీల పెంపుపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారు అని , లాక్ డౌన్ కారణంగా ఉపాధి లేక భవన నిర్మాణ కార్మికులు మొదలు అందరూ ఇబ్బంది పడుతున్నారు అని ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కరెంటు బిల్లులు పెంచేశారు అన్నారు. రెండు నెలల బిల్లులు కలిపేసి కేటగిరీలు మార్చేసి ఇష్టారాజ్యంగా దోపిడీ చేస్తారా అని ప్రశ్నించారు? ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలి అన్నారు. తెలుగుదేశం హయాంలో ఒక్కసారి కూడా కరెంటు చార్జీలు పెంచలేదు అన్నారు. సంవత్సరం తిరక్కుండానే కరెంటు చార్జీలు పెంచి ఇలా బిల్లులు పంపడానికి మించి అమానుషం లేదు అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పెరిగిన బిల్లులు కట్టడానికి ప్రజలు సిద్ధంగా లేరు అన్నారు. కరోనా భయంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారు. ఇదేమీ లెక్కలేకుండా మీ ఖజానాను పెంచుకోడానికి సామాన్యులను దోచేస్తారా? అన్నారు. కరెంటు బిల్లులు వసూలు కార్యక్రమాన్ని పక్కనపెట్టండి, మీ వసూళ్లు, దోపిడీని పక్కనపెట్టండి. మార్చి 20 తర్వాత లాక్ డౌన్ ప్రారంభమైంది. ఏప్రిల్ లో బిల్లు కట్టారు. మళ్లీ మీరు మార్చి, ఏప్రిల్ కలిపేసి బిల్లులు పంపిస్తారా? అన్నారు. చంద్రబాబు పిలుపు మేరకు వచ్చే వారం కరెంటు చార్జీల పెంపుకు నిరసనగా టీడీపీ శ్రేణులు నిరసన తెలుపుతాం అన్నారు.
ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కొట్టే వెంకటరావు, పి.వి.ఫణి కుమార్, కసాని భాగ్యరావు, వాటపల్లి రాము, గండికోట అంజిబాబు, అంకుమంతి రాజా,కొల్లు రంగ, తదితరులు పాల్గొన్నారు.

# 500 వందల కుటుంబాలకు బత్తాకాయలు పంపిణీ



**(విన్యూస్, మచిలీపట్నం) :** కరోనా వైరస్ నేపథ్యంలో ప్రజల్లో "సి" విటమిన్ పెంపొందించేందుకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో జనసేన పార్టీ నాయకులు జనసేన పార్టీ ఒకటవ సెగ్మెంట్ అభ్యర్థి మేడ పిచ్చయ ఆర్థిక సౌజన్యంతో 500 కుటుంబాలకు చక్కటి బత్తా కాయలు కోడూరు ఎస్ఐ పి రమేష్ చేతుల మీదుగా పంపిణీ ప్రారంభించారు. కోడూరు గ్రామ పంచాయతీ పరిధిలోని వివర్స్ కాలనీ కాపుల కాలనీ లో ప్రతి ఇంటి వద్దకు వెళుతూ వీటిని అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఉల్లి శేషగిరి,బడే వెంకటేశ్వరరావు, రేపల్లె రాజా, బిజెపి నాయకులు బండే ఆంజనేయులు, జనసేన పార్టీ 2వ సెగ్మెంట్ కొండవీటి సునీత, స్థానిక జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు

# అన్నదానం మహాదానం: మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి వరప్రసాద్



**(విన్యూస్, పులివెందుల) :** ఆకలితో ఉన్న వ్యక్తికి కడుపునిండా తృప్తిగా భోజనం పెడితే, దానిని మించిన మహోన్నతమైన దానం మరొకటి లేదని, అన్నదానం చేయడం సర్వోన్నతమైన మహాదానం గా మన శాస్త్రాలు అభివర్ణిస్తున్నాయని, అందులోనూ, కరోనా కష్టకాలంలో ప్రతి వ్యక్తి నిరుపేదల కడుపు నింపేందుకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి వల్లెపు వరప్రసాద్ పేర్కొన్నారు.

స్థానిక మున్సిపల్ మస్టర్ కార్యాలయంలో ఈరోజు పట్టణ వైకాపా ఇంచార్జి వైయస్ మనోహర్ రెడ్డి గారి సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వరప్రసాద్ ప్రారంభించారు. అనంతరం పోలీస్ స్టేషన్లో పోలీసు సిబ్బందికి భోజన సదుపాయం కల్పించారు.

ఈ కార్యక్రమంలో రంగనాథస్వామి దేవస్థానం చైర్మన్ యేర్వ వెంకట సుబ్బయ్య ,బూత్ కమిటీ మేనేజర్ హాల్ గంగాధర్ రెడ్డి, వికలాంగుల సంఘం అధ్యక్షులు రఘునాథరెడ్డి, కౌన్సిలర్ అభ్యర్థులు రంగాపురం మున్నారెడ్డి, కిషోర్ డేనియల్, సిద్ధయ్య, శ్రీనివాసులు,ఎర్ర గుడిపల్లి యూత్ బిరుసు ప్రతాప్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నిత్యావసర కూరగాయలు పంపిణీ



**(విన్యూస్, మచిలీపట్నం) :** మచిలీపట్టణం నియోజకవర్గం మంగినపూడి గ్రామం వనెంరెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో కరోనా వైరస్ లాక్ డౌన్ కారణంగా ఇబ్బంది పడుతున్న గ్రామంలోని ప్రజలకు నిత్యావసర కూరగాయలు పంపిణి కార్యక్రమాన్ని మాజీ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశంపార్టీ అభ్యక్షులు కుంచె నాని, గ్రామా సీనియర్ నాయకులు భానుమూర్తి, లంకె శేషగిరి, గ్రామా తెలుగుదేశంపార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిత్యావసర సరుకులు అధిక ధరలకు విక్రయిస్తే వ్యాపార లైసెన్సులు రద్దు - ఆర్ డివో




**(విన్యూస్, మచిలీపట్నం) :** నిత్యావసర సరుకులు అధిక ధరలకు విక్రయిస్తే వ్యాపార లైసెన్సులు రద్దు చేయడం జరుగుతుందని బందరు ఆర్ డివో ఎన్ఎస్‌కె ఖాజావలి వ్యాపారులను హెచ్చరించారు. బుధవారం ఆర్ డివో, మున్సిపల్ కమీషనర్ ఎస్. శివరామకృష్ణ ఇరువురు కలసి పట్టణంలో కోనేరు సెంటరు, పలు ప్రాంతాల్లో పర్యటించి సుమారు 60 షాపులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ డివో మాట్లాడుతూ కరోనా మహమ్మారి వ్యాప్తి నివారణకై గత 50 రోజులుగా పటిష్టవంతంగా అమలవుతున్న లాక్‌డౌన్ కొంత సడలింపు వల్ల ఈ నెల 12 నుండి అన్ని నత్యావసర, నిత్యావసరం కాని షాపులు రోజు విడచి రోజు తెరుచుటకు 1, 2 నెంబరింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. మంగళవారం 1వ నెంబరు షాపులు, బుధవారం 2వ నెంబరు షాపులు తెరిచి వ్యాపారులు చేసుకోవాలని ఆదేశాలివ్వడం జరిగిందన్నారు. ఈ విధానం ఎలా అమలవుతున్నది ఈ రోజు పలు షాపులు తనిఖీ నిర్వహించి పరిశీలించామన్నారు. చాలా వరకు షాపులు ధరల పట్టికలు ప్రదర్శించి విక్రయాలు జరుపుతున్నప్పటికి కొంత మంది ధరల పట్టిక లేకుండా ధరల పట్టిక సరిగా కనబడకుండా చిన్నది పెట్టడం గమనించామని, మరికొంత మంది అధిక ధరలకు నిత్యావసరాల సరుకుల విక్రయాలు జరుపుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అట్టి వారి లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరిక చేశామని అన్నారు. కావున ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే అధిక ధరలకు విక్రయిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రెవిన్యూ, మున్సిపల్ సిబ్బంది ఆర్ డివో ఎన్.ఎస్.కె. ఖాజావలి వెంట ఉన్నారు.

# 4వ విడత లాక్‌డౌన్‌లో అన్ని రకాల వ్యాపారాలకు సడలింపు ఇవ్వాలి- కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ యరమల




**(విన్యూస్, మాచర్ల) :** 4వ విడత లాడ్ డౌన్‌లో అన్ని రకాల వ్యాపారులకు సడలింపు ఇవ్వాలని మాచర్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ డాక్టరు యరమల రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. డాక్టరు రామచంద్రారెడ్డి తన కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ ప్రధాన మంత్రి ప్రజలతో మాట్లాడుతూ 4వ విడత లాక్‌డౌన్ విధించే అవకాశం ఉన్నట్లు వెల్లడించటంతో ప్రజల అందరు తీవ్ర ఆందోళనకు గురి అవుతున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయం పట్ల తన కార్యాలయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. డాక్టరు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కరోనా కట్టడి కోసం చేపట్టిన లాక్ డౌన్‌కు ప్రజల నుండి సంపూర్ణ మద్దతు లభించిందన్నారు. దీని వలన వ్యాపారులు తీవ్రంగా నష్టపోయినట్లు వివరించారు. కార్మిక వర్గం ఆర్థిక ఆవేదనను వర్ణించలేమన్నారు. ఈ నేపధ్యంలో 4వ విడత లాక్‌డౌన్‌లో సడలింపులు ఇచ్చి అన్ని వర్గాల వ్యాపారులకు అవకాశం ఇస్తే అన్ని రకాల పనులు ప్రారంభం అయి కార్మికులకు కూడ ఉపాధి దొరుకుతుందన్నారు. లేదంటే వీరంతా తీవ్రంగా ఆర్థికంగా చితికిపోయి వీరిలో ఆకలికేకలు వినిపించే అవకాశం ఉందన్నారు. ప్రధాన మంత్రి ఇచ్చే ఆర్థిక ప్యాకేజి బిజెపి ఎం.పిలకు, వారికి కోమ్ము కాచే పారిశ్రామిక వర్గాలకు కాకుండా అన్ని వర్గాల ప్రజలకు అందేలా ఆర్థిక ప్యాకేజిని అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ డాక్టరు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు నట్టువ రాధక్రిష్ణా, జివి సత్యనారాయణ, షేక్ షకీర్‌ఆలీ, వంగపాటి నాగరాజు, కోమ్ము కోటేశ్వరరావు తదితరులు పాల్గోన్నారు.

# లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు పంపిణీ

**(విన్యూస్, మచిలీపట్నం) :** కరోనా లాక్ డౌన్ పరిస్థితులు పురస్కరించుకుని లంకిశెట్టి ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో బుధవారం 42వ రోజు సేవా కార్యక్రమం జరిగింది. 17 వ డివిజన్ లో జరిగిన ఈ కార్యక్రమంలో రిక్షా కార్మికులకు, వంటలు చేసే సహాయకులకు చెందిన 10 కుటుంబలకు అడ్వకేట్ లంకిశెట్టి బాలాజీ అందించారు. జాతీయస్థాయి క్రికెట్ క్రీడా కారుడు శికినం శ్రీనాథ్ సహకారంతో 10 నిరుపేద కుటుంబాలకు బియ్యం, కూరగాయలు, నిత్యవసర వస్తువులు, కోడిగుడ్లు అందించడం జరిగిందని బాలాజీ తెలిపారు. లాక్ డౌన్ వలన మచిలీపట్నం లో మధ్యతరగతి కుటుంబీకులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వం తక్షణమే ప్రతి కుటుంబానికి



10000 ఆర్థిక సహాయం అందించాలని బాలాజీ అన్నారు. లాక్ టౌన్ సడలింపు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మాస్కులు లేకుండా తిరగవద్దు అని జన సమూహాలకు దూరంగా ఉండాలని బాలాజీ అన్నారు. జన జాగృతి సంస్థ తరుపున శికినం కాళిదాసు, ఆదినారాయణ మస్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 15 వ మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ, మాజీ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గోవడ నీరిక్షణరావు, న్యాయవాది తాతా గోపి, లంకిశెట్టి సంతోష్, జి. నారాయణ రావు, ఈమని సతీష్, భాను తదితరులు పాల్గొన్నారు.

# జేసీని మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్డీఓ

**(విన్యూస్, మచిలీవట్నం) :** జిల్లాకు నూతనంగా నియమితులైన గ్రామ/వార్డు సచివాలయాలు మరియు అభివృద్ధి సంయుక్త కలెక్టర్ శివ శంకర్ లతోటి బుధవారం కలెక్టరేట్



ను సందర్శించగా మర్యాదపూర్వకంగా కలిసి బందరు ఆర్డీఓ ఖాజావలీ శుభాకాంక్షలు చెప్పారు.

V స్మార్ట్ యాడ్స్

**Insurance**
యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అన్ని రకాల వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించబడును. ఇన్సూరెన్స్ చేయించుకోదలచిన వారు సంప్రదించండి: టి.సి.ఎన్ శ్రీనివాస్. 9246761404 08672-221097

**మస్కిటో డోర్స్&విండోస్**
చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్... అల్యూమినియమ్ మస్కిటో డోర్స్&విండోస్ తయారు చేయబడును. మరియు రిపేర్ చేయబడును. సంప్రదించండి: చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్ గొడుగుపేట-మచిలీపట్నం సెల్:9182197822 9121605277

**LOANS**
HOME LOANS BUSINESS LOANS... PLEASE CONTACT: 9399936609

**తక్కువధరకే ప్రకటనలు**
ఇల్లు/స్థలం అమ్మలన్నా, కొనాలన్నా, అద్దెకు ఇవ్వాలన్నా, ఉద్యోగం కావాలన్నా, ఉద్యోగులు కావాలన్నా తక్కువ ధరతో విన్యూస్‌లో ప్రకటన ఇచ్చి నిశ్చింతంగా ఉండండి. మరిన్ని వివరాలకు సంప్ర: 9848667347

**వి స్మార్ట్ యాడ్స్**
కేవలం రూ.100/-లకే స్మార్ట్ యాడ్..
-----------
సంప్రదించండి 9848667347

**LOANS**
BUSINESS LOANS MORTIGAGE LOANS CONTACT: 9491624334

**LOANS**
పర్సనల్ లోన్స్, బిజినెస్ లోన్స్, అగ్రికల్చర్ లోన్స్, ఎడ్యుకేషన్ లోన్స్ అన్ని రకాలలోన్స్ 2 రోజుల్లో ఇప్పించబడును. వడ్డీ 50 పైసలు. 1 లక్ష నుంచి 50లక్షల వరకు ఇవ్వబడును. కావల్సిన వారు సంప్రదించండి: 7095129660

**అమ్మబడును**
మచిలీపట్నం శివారు రాడార్ కేంద్రం దగ్గర కళ్యాణీటౌన్‌షిప్‌లో 300గజాల ఫ్లాట్ అమ్మబడును. కావల్సిన వారు సంప్రదించండి: సెల్: 7032931205 సంప్రదించు వేళలు: ఉదయం11 - 2పిఎం

# అవినీతికి పాల్పడ్డ ఇద్దరు కానిస్టేబుళ్ళపై సస్పెండ్ వేటు : ఎస్‌పి



**(విన్యూస్, మచిలీవట్నం) :** కృష్ణాజిల్లా పోలీసు శాఖలో కానిస్టేబుళ్ళుగా విధులు నిర్వహిస్తూ, చెక్‌పోస్టువద్ద తనిఖీలలో మద్యం అక్రమ రవాణాదారుల నుండి, అలాగే అనుమతిలేకుండా ఇతర రాష్ట్రాలనుండి జిల్లాలోకి ప్రవేశించిన వాహనదారులవద్దనుండి నగదు వసూళ్ళు చేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న గంపలగూడెం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పిసి-1140 జె. నాగమల్లేశ్వరరావు, విస్సన్నపేట పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ పిసి-855 జి.అజయ్‌లపై ఆరోపణలు రుజువు కావడంతో వారిరువురిని విధుల నుండి సస్పెండ్ చేస్తూ జిల్లా యస్పీ రవీంద్రనాధ్ బాబు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయం నుండి ఉత్తర్వులు జారీచేసినారు. గంపల గూడెం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ ఇసుక అక్రమ రవాణాను నిరోధించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ముబైల్ పార్టీలో విధులు నిర్వహిస్తూ ఈనెల10వ తేదీన తెలంగాణా రాష్ట్రం నుండి ఆంధ్రకు అక్రమ మద్యాన్ని తీసుకొస్తున్న ద్విచక్రవాహనదారులను నిలువరించి తనిఖీచేసి అతనివద్ద అక్రమ మద్యం వున్నదని గుర్తించి పోలీసు అధికారులకు సమాచారం అందించకుండా, పోలీస్ స్టేషనకు కూడా పంపకుండా అతడిని భయపెట్టి 10,000/- రూ నగదు డిమాండ్ చేసి 5,000/-రూ గూగుల్ పే ద్వారా తీసుకున్నాడని సమాచారం యస్పీ గారికి చేరగా, యస్పీ గారికి అందిన సమాచారం మేరకు నూజివీడు డియస్పీ గారికి తగు విచారణ నిర్వహించి నివేధిక సమర్పించమనగా, వచ్చిన రిపోర్టు ఆధారంగా కానిస్టేబుల్ నాగమల్లేశ్వరరావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

విస్సన్నపేట ఎయమ్‌సీ చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ అజయ్ ఈ నెల 8వ తేదిన నాడు కారులో తెలంగాణా రాష్ట్రం నుండి ఇద్దరు వ్యక్తులు విజయవాడ వస్తుండగా విస్సన్నపేట చెక్‌పోస్టు వద్ద ఆకారును ఆపి తనిఖీచేసి పత్రాలన్నీ పరిశీలించి వారి వద్ద ప్రయాణించేందుకు అనుమతి పత్రం లేదని కనుక 1,000/- రూ ఇవ్వాలని వారిని డిమాండ్ చేయగా, ఆఇద్దరు వ్యక్తులు తమ వద్ద అంత నగదు లేదని 500/- రూ కానిస్టేబుల్ అజయ్‌కు ఇవ్వగా ఈ జరిగిన సన్నివేశాన్నంతటిని ఆకారులోవున్న వ్యక్తి వీడియో తీసి ఉన్నతాధికారులకు పంపగా, విచారణలో అదినిజమని నిర్ధారణ కావడంతో, యస్పీకి అందిన నివేధిక మేరకు కానిస్టేబుల్ అజయ్‌ను సస్పెండ్ చేస్తూ యస్పీ ఉత్వర్వులు జారీచేశారు. నిర్వహించే విధుల పట్ల ప్రతిఒక్క సిబ్బంది, అధికారులు నిబద్దతతో వ్యవహరించాలని, అలాకాకుండా అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నా, అవినీతికి పాల్పడినా, పాల్పడేవారికి సహకరించినా ఎవరినీ ఉపేక్షించేది లేదని, అలా ఎవరైనా అధికార దుర్వినియోగానికి పాల్పడితే వారిపై తీవ్రమైన శాఖాపరమైన చర్యలకు వెనుకాడబోమని జిల్లా యస్పీ రవీంద్రనాధ్ బాబు హెచ్చరించారు.

# 70 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ

**(విన్యూస్, మచిలీవట్నం) :** లాక్ డౌన్ నేపథ్యంలో, ఉపాధి కోల్పోయిన వారిని ఆదుకోవాలని ఒక మంచి ఉద్దేశ్యంతో బుధవారం బెరాకా మినిస్ట్రీస్ వారి ఆధ్వర్యంలో గోడౌన్ ఎదురుగా ఉన్న, కాలనీలో ఉన్న 70 కుటుంబాలకు 11 రకాల నిత్యవసర సరుకులు, 5 రకాల కూరగాయలు. బెరాకా మినిస్ట్రీస్ అధినేత బి.ఎస్.కిరణ్ పాల్ గారు,వేముల గాంధీ, బి. గంగాధరరావు, బెరాకా వాలంటీర్లు అందించారు.



# భౌతిక దూరం పాటించాలి - సచివాలయ ఆడ్మిన్



**(విన్యూస్, మాచర్ల):** మాస్కులు తప్పని సరిగా ధరించి ఇళ్ళ నుండి బయటకు వచ్చిన ప్రజలు భౌతిక దూరం పాటించాలని 14,15 వార్డుల వార్డు సచివాలయ ఆడ్మిన్ కోరారు. 14,15 వార్డుల పరిధిలో మాస్కుల పంపిణి గురించి మాట్లాడుతూ ఇప్పటికే 15వ వార్డులో ఇంటింటికి తిరిగి ఒక్కొక్కరికి 3 మాస్కులు పంపిణి చేసినట్లు తెలిపారు. తదుపరి 14వ వార్డులో మాస్కులు పంపిణి చేస్తామన్నారు. ప్రజలు ఇంటికి రాగానే సబ్బుతో 30 సెకన్లు హ్యాండ్ వాష్ చేయాలన్నారు. కంటైనేమెంట్ ప్రాంతం, బఫర్ జోన్‌లో తిరిగితే స్థాన్నం చేస్తే మంచిదన్నారు. లాక్‌డౌన్ నిబంధనలను పాటిస్తే కరోనాను తరిమి కొట్టవచ్చునని అన్నారు. ఎంతో అత్యవసరం, నిత్యవసరాల సేకరణకు మాత్రమే ప్రతి ఇంటి నుండి ఒకరు మాత్రమే బయటకు వస్తే మంచిదన్నారు. ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ స్వీయ హౌస్ క్వారంటైన్ పాటిస్తే కరోనా వ్యాప్తిని నివారించవచ్చునని వివరించారు. కరోనా లక్షణాలు అని అనుమానం వస్తే వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు వెళ్ళి తగిన పరీక్షలు చేయించుకోవాలన్నారు. పరీక్షిస్తేనే కరోనా పాజిటివ్, నెగిటివ్ అని తెలుస్తుందన్నారు. తుమ్మినప్పుడు నోటి నుండి , ముక్కు నుండి వచ్చే తుంపర్ల వలన కరోనా వచ్చే ప్రమాదం పోంచి ఉందన్నారు. దీనిని నివారించేందుకు ప్రభుత్వం ప్రజల అందరికి మాస్కులు పంపిణి చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో వేల్ఫేర్ సెక్రటరీ విజయ పాల్గొన్నారు.

# గడ్డు పరిస్థితులలో హమాలీలు

**(విన్యూస్, మాచర్ల):** లాక్‌డౌన్ నేపధ్యంలో వ్యాపారాలు కుదేలు అవటంతో దానిపై ఆదారపడిన హమీలీలు కూడ గడ్డు పరిస్థితులను ఎదుర్కోనవలసి వస్తుంది. గతంలో ఆదివారం తప్పు అన్ని రోజులు పనులతో బిజీగా ఉండే హమీలీలు ఇప్పుడు 3 లేక 4 రోజులకు ఒక పర్యాయం వచ్చే లారీల కోసం ఎదురు చూస్తు కాలం గడుపుతున్నారు. నిత్యవసర



వస్తువులకు కోంత వెసులు బాటు ఉండటంతో నిత్యవసర సరుకుల కోసం వచ్చే లారీలతో చావకుండా, బ్రతకు బండి నడుపున్నట్లు హమీలీలు చేపుతున్నారు. రెక్కాడితే కాని డొక్కాడని హమీలీల జీవితాలు రెక్కలు ఆడకపోవటంతో పస్తుల వైపుగా కుటుంబాలు వెళుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పీసు రేటుతో అన్ని రకాల షాపుల వద్ద పని చేస్తే రోజుకి రూ 400 వరకు సంపాందించే వారు నేడు రూ 200కు సంపాందించే స్థితి అని ముఠా వర్కర్ వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. వీరితో పాటు పలు వస్త్ర ఇతర వ్యాపార సంస్థలలో పనిచేసే గుమాస్తాల పరిస్థితి కూడ దారుణంగా ఉంది. వస్త్ర దుకాణాలు పూర్తిగా మూత పడి ఉండటంతో అందులో పనిచేసే గుమాస్తాలు ఇంటికే పరిమితం అయినారు. దాదపు 2 నెలలు కావస్తుండటంతో ఎప్పుడు సడలింపులు వస్తాయా, ఎప్పుడు షాపులు తీస్తారా అని ఎదురు చూస్తున్నారు. వస్త్ర దుకాణాలలో ముఖ్యంగా దిగువ, మద్య తరగతికి చెందిన మహిళలు పనిచేస్తుంటారు. వేడినీళ్ళుకు చన్నీళ్ళు తోడు అన్నట్లుగా చిన్న చిన్న పనులు చేసే భర్తలకు తోడుగా వివిధ దుకాణాలలో పనిచేసే మహిళల సంపాదనతో కుటుంబం వడిదోడుకుల పాలుకాకుండా నడుస్తుండేది. ఇతర రంగాలలో పనిచేసే భర్తలకు ఉపాధి లేక, వీరికి ఉపాధి కోల్పోయి ఇల్లు గడవటం కష్టంగా మారినాయి. ప్రభుత్వం వారి కుటుంబాలను ఆదుకునేందుకు ప్రత్యేక చోరవ తీసుకుని ఆర్థికంగా ఆదుకోవాలన్నారు.

# నిరుపేదలకు నిత్యవసరాలు పంపిణి చేసిన సదాశివరాజు

**(విన్యూస్, మాచర్ల):** : స్థానిక ప్రముఖ వైద్యులు విద్యాదరణి సదాశివరాజు పట్టణంలోని రైలు గేటు సమీపంలోని 70 నిరుపేద కుటుంబాల వారికి బుధవారం నిత్యవసరాల సరుకులు, కూరగాయలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా సదాశివరాజు మాట్లాడుతూ లాక్‌డౌన్ వలన పనులు లేక ఇబ్బంది పడుతున్న పేదలకు ఆర్థిక స్థోమత గల వారు స్పందించి సాయం చేయాలన్నారు.

# ప్రజల శ్రేయస్సును ప్రభుత్వం గాలికొదిలేసింది

**(విన్యూస్, మార్కాపురం) :** ప్రకాశం జిల్లా మార్కాపురం ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలుగుదేశం పార్టీ మార్కాపురం నియోజకవర్గం ఇంచార్జి కందుల నారాయణ రెడ్డి వైస్సార్సీపీ పైన మండిపడ్డారు రాష్ట్ర ప్రభుత్వం ప్రజల శ్రేయస్సు గాలికి వదిలేసిందని అలాగే వెలుగొండ ప్రాజెక్ట్ నీటిని మార్కాపురం మరియు పశ్చిమ ప్రకాశం ప్రజలు వాడుకునే పరిస్థితి లేకుండా చెయ్యాలని అలాగే పోతిరెడ్డి పాడు ద్వారా వెలుగొండ ప్రాజెక్ట్ నీటిని కడప కు తరలించే ఆలోచనను ఉపసంహారఇంచుకొవాలని లేని పక్షమున పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు మరియు జిల్లాలో మద్యం అమ్మకాలలో అధికారులు మరియు కొందరు నాయకలు కుమ్మకు అయ్యారని గుర్రాలు గాడిదలకు తాపె మందు ప్రజలకు విక్రఇస్తూ అలానే బ్రాండ్ ఉన్న మద్యం ఎక్కువ రెట్లకు బ్లాక్ లో విక్రయాలు చేస్తూ డబ్బులు దోచుకుంటున్నారు అని సిబిఐ సీఐడి ఎస్బి ద్వారా విచారణ జరపాలని ద్వాజమెత్తరు ఈ కార్యక్రమంలో వక్కలగడ్డ మల్లికార్జున మండల అధ్యక్షులు నాసర్ రెడ్డి నాయకులు మరియు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 17వ డివిజన్‌లో నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ

**(విన్యూస్, మచిలీపట్నం) :** కరోనా వైరస్ లాక్ డౌన్ నేపథ్యంలో మచిలీపట్టణం కార్పొరేషన్ 17వ డివిజన్ లో ఇంటింటికి నిత్యావసర కూరగాయలు మాజీ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్




అభ్యర్థిని మరకని మమత కీర్తి , తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు మరకని పరబ్రమం, మరకాని సతీష్ తెలుగుదేశంపార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాబోధనలలో సంస్కరణలు తప్పనసరి

**(విన్యూస్, మచిలీపట్నం) :** కృష్ణావిశ్వవిద్యాలయంలో ఆధ్వర్యంలో గత రెండురోజులగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్న నూతన పద్దతుల ద్వారా భోదన, అభ్యాసన అను అంశంపై ఏర్పాటుచేసిన వర్క్‌షాపు ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ ఆచార్య రామమోహన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విపత్కర పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అధ్యాపకులందరూ నూతన భోదనా పద్దతులను అవగాహన కల్పించుకొని విద్యార్దినీ విద్యార్దులకు ఆన్‌లైన్ విధానముపై అవగాహన కల్పించి తద్వారా వారికకి విద్యాసంవత్సరం వృదా కాకుండా సహకరించాలని తెలిపారు.

# ప్రాజెక్టుల నిర్మాణం వైఎస్ఆర్ చలువే



**(విన్యూస్, మచిలీపట్నం) :** దివంగత నేత స్వర్గీయ వైఎస్ఆర్ గొప్ప ఆలోచన విధానమే ఉమ్మడి రాష్ట్రంలో ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. పాలమూరు - రంగారెడ్డి దాడి ప్రాజెక్టుల నిర్మాణాల ద్వారా ప్రజానీకానికి, రైతులకు నీరు అందించటానికి అవకాశం కలిగింది. అన్ని ప్రాంతాల ప్రజల అవసరాలు దృష్టిలో పెట్టుకొని వాళ్ల శ్రేయస్సు ప్రారంభించారని ఎమ్‌డి సదరుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిజేషి కుమార్ తీర్పు కృష్ణానదిలో 70 శాతం నీటి లబ్యత ఆధారంగా అప్పటి ఉమ్మడి రాష్ట్రానికి 800 టిఎమ్‌సి నీటిని కేటాయించటం జరిగింది. ఏది ఏమైన రాయాలసీమ ప్రాంత ప్రజలకు న్యాయం చేయాలనే సదుద్దేశంతో ఆ ప్రాంత ప్రజలను సాగు, త్రాగు నీరు అందించటానికి కృషి చేస్తున్న ఏపి సిఎం జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి చాలా అభినందనీయమన్నారు.

# మాస్కులు పంపిణి చేసిన లయన్స్ క్లబ్

**(విన్యూస్, మాచర్ల):** పట్టణంలోని 7, 13 వార్డులలో లయన్స్ క్లబ్ ఆప్ పల్నాడు ఆధ్వర్యంలో మాస్కులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా క్లబ్ రీజియన్ ఛైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి మాట్లాడుతూ పై 2 వార్డులలో ప్రతి ఇంటికి తిరిగి మాస్కులు పంపిణి చేసి మాస్కుల వలన కరోనా అంశంలో కల్గు ఉపయోగాలను వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాస్ట్ రీజియన్ ఛైర్మన్ చుండూరు వెంకటేశ్వర్లు,చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వాకర్స్ క్లబ్ సేవలు అభినందనీయం-రూరల్ ఎస్.ఐ ఉదయలక్ష్మి

**(విన్యూస్, మాచర్ల) :** పట్టణంలోని వాకర్స్ క్లబ్ సేవలు అభినందనీయమని రూరల్ ఎస్.ఐ ఉదయలక్ష్మి అన్నారు. నెహ్రునగర్‌లో ఉంటున్న వలసకూలీలు ఇక్కడ ఐస్‌లు అమ్ముకునేందుకు వచ్చి లాక్‌డౌన్ నేపద్యంలో ఇబ్బంది పడుతున్నారు. వీరికి బుధవారం



వాకర్స్ క్లబ్ ఆద్వర్యంలో గోధమ పిండి, నూనె ప్యాకేట్స్, కూరగాయలను పంపిణి చేశారు. రూరల్ ఎస్.ఐ ఉదయలక్ష్మి పంపిణిని ప్రారంభించి మాట్లాడుతూ కరోనా కట్టడి కోసం ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్ ప్రారంభం నుండి కోవిడ్ విధులు నిర్వహించే వారికి, పేదలకు, వలస కూలీలకు, కోతులు, ఆవులకు ఆహారం అందిస్తూ సేవలు అందిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో అధ్యక్షులు గోపవరపు నాగేశ్వరరావు, పోలూరి శ్రీనివాసురావు, చెంచురెడ్డి, మేడం నాగేశ్వరరావు, ఇమ్మడిశెట్టి ప్రసాదు, చారి తదితరులు పాల్గొన్నారు

# ప్రజల త్యాగాలకు విలువ ఇదేనా...

## మద్యం షాపులు తెరవడం పై నోరు మెదపరా...

**(విన్యూస్, నెల్లూరు) :** దేశమంతా కరోణ భయంతో వణుకుతుంది ప్రజలంతా లాక్ డౌన్ నిబంధనలు పాటిస్తూ ఇళ్లలోనే బ్రతుకుతున్నారు కూలి చేసుకుంటేనే కూడు దొరికేది పేదలు కూలికి వెళ్ళలేక బిడ్డల ఆకలి తీర్చ లేక మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. అయినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ దేశం కోసం మేము సైతం అంటూ త్యాగాలకు సిద్ధం అయ్యారు ఉన్నవారికి రోజులు ఎలా గడపాలో తెలుసు. వేతన జీవులకు నెలనెలా సంస్థ వేతనాలు అందుతాయి ఎటొచ్చి మధ్యతరగతి ప్రజలు బీదా, బిక్కి జనం పట్టెడన్నం కోసం పడుతున్న పాట్లు ఎన్నో అవి వారికే తెలుసు బడుగు బిడ్డలను కదిపితే వారి హృదయం ఒక్కసారిగా



బ్రద్దలు అవుతుంది ఈ విధంగా ప్రజలు త్యాగాలు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మద్యం అమ్మకాలను గేట్లు బార్లా తెరిచింది మందుబాబులకు ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది ,భౌతిక దూరం లేదు ,ముఖాలకు మాస్కు లేవు ఒకరిపై ఒకరు పడి మద్యం కోసం ఎగబడుతున్న దృశ్యాలు లాక్ డౌన్ వారి కోసం త్యాగం చేస్తున్న వారి త్యాగాలను వెక్కిరిస్తున్నాయి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో మధ్య విమోచన ప్రచార కమిటీ పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేశారు లాక్ డౌన్ నిబంధనలు ఉలాంగింపబడి ప్రజల త్యాగాలు వృధా అవుతున్న ఈ మధ్యవిమోచన ప్రచార కమిటీ బాద్యులు నోరు మెదపకపోవడం పై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సదరు కమిటీ బాధ్యులు ప్రభుత్వానికి తగు సూచనలు ఇచ్చి మద్యం షాపులు తెరవడం పై తమ నిరసన తెలియ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# మది విజయ సోపానాలు 1
## విజయం వెనుక అపజయం


బి.మల్లికార్జున దీక్షిత్
కౌన్సిలింగ్ సైకాలజిస్ట్

**(విన్యూస్, మచిలీపట్నం) :** నిజమే మీరు సరిగ్గానే చదివారు విజయం వెనుకాల అపజయం వుంది అంటే మీరు అపజయాలలోంచి బయటపడి విజయాల వైపు పయణిస్తున్నారన్నమాట అపజయం అనేది విజయనికి తొలిమెట్టు మీకు తెలుసు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు గారు ఎంత పెద్ద గాయకుడో మరి మొదట్లో ఆయన గాత్రాన్ని అవహేళన చేసిన వాళ్ళు ఎంతమందో. అలాగే అమితాబ్ బచ్చన్ గారి మోహం నటనకు పనికి రాదన్నారు మహానటి సావిత్రి గారిని నీకు యాక్షన్ రాదని చెప్పి హీరోయిన్ పాత్ర నించి తీసేసిన సినిమా వుంది. అందాల హీరో శోభన్ బాబు గారి పరిస్థితి అంతే ఇంచుమించు పది సంవత్సరాలకు పైగా కష్ట పడితేగాని గొప్ప నటుడు కాలేక పోయాడు ఇక నిర్మాత శ్రీ డి.రామానాయుడు గారి పరిస్థితి కూడ దారుణమె అన్ని పోగొట్టుకుని ఇంటికి పోదాం అనుకునే ప్రయత్నంలో ప్రేమనగర్ సినిమా తీసి సూపర్ హిట్ కొట్టి నిర్మాతగా అనేక సినిమాలు దేశంలోని అన్ని భాషల్లోనూ తియ్యడం చాల అరుదయిన విషయం. నేను చెప్పిన వాళ్ళందరూ చాల గొప్పవాళ్లుగా ఈనాడు పరిగణిస్తున్నారు మరి మొదట్లో వీళ్ళందరూ పరాజితులు గ పేరు తెచ్చుకున్నారు రిజెక్ట్ చేయబడినవాళ్ళే. ఇక సైన్స్ విషయాలోకెళ్తే ఈ నాడు మనం అనుభవిస్తున్న ఎలక్ట్రిక్ బల్బ్ టెలిఫోన్ లు కనిపెట్టడంలో ఎన్నో సార్లు విఫలమై తరువాతసఫలమైన వారే. నేడు వ్యాపార రంగాలలో ప్రముఖులైన వ్యక్తులందరూ నాడు వ్యాపారాలలో ఆటుపోట్లు చూసినవారే. ఇలా చెప్పుకుంటూ పోతే ఉదాహరణలు కోకొల్లలు.

జీవితం లో గెలవాలి అనుకున్నప్పుడు అపజయం అనే మాట మర్చిపోవాలి నిరాశ నిస్పృహ కు చోటు ఇవ్వకూడదు (గెలుపు మార్గాల గురించి రేపు చెప్పుకుందాం)

# భాదితులకు అన్నం పొట్లాలు పంపిణీ



**(విన్యూస్, పొన్నూరు) :** కరోనా ప్రభావం తో అన్నానికి అల్లాడుతున్న వర్గాల వారిని గుర్తించి నిత్యం తమ పార్టీ బృందం సహకారంతో అన్నం పొట్లాలను పంపిణీ చేస్తున్నామని బి జె పి స్థానిక నాయకుడు కలపాల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద పేదలకు అన్న పొట్లాలు పంపిణీ చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ , గుంటూరు పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ గార్ల పిలుపు మేరకు పొన్నూరు పట్టణం బిజెపి కమిటీ వారు పొన్నూరు బీజేపీ కార్యాలయము వద్ద ఈ నెల17 వ తారీఖు వరకు అన్నదాన వితరణ కార్యక్రమం జరుగుతుందని, పొన్నూరు పట్టణ అధ్యక్షుడు ఎం సాంబశివరావు ఆధ్వర్యంలో ఈ వితరణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి సత్య మూర్తి , వడ్రాణం ఉదయ్ కుమార్, విశ్వశెట్టి పవన్ , ఎ. సాంబశివరావు , అజిత్ , వి. రాంబాబు , మన్నేపల్లి చంద్రశేఖర రావు, వాడపల్లి సురేంద్ర ,తూమాటి నరేంద్ర, కలపాల శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

# చదువుతోపాటు, సేవా కార్యక్రమంలో ముందుంటాం



**(విన్యూస్, కంకిపాడు) :** చదువుతోపాటు, సేవా కార్యక్రమంలో ముందు ఉంటామని ఉపాధ్యాయుల సంఘం జిల్లా నాయకులు యం.శ్రీనివాసరావు అన్నారు. పారిశుధ్య కార్మికులకు అల్పాహారాన్ని అందజేశారు. కంకిపాడు మండలంలోని పునాది పాడు, గ్రామ పంచాయతీ కార్మికుల కు 30 మంది కి, కంకి పాడు పారిశుధ్య కార్మికులకు 60 మంది కి టిఫిన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పంచకర్ల రంగారావు సి.పియం.నాయకులు వి.నాగేశ్వరరావు,వి. వెంకటేశ్వరరావు, సిఐటియు మండల కార్యదర్శి బి .రాజేష్, యు టి ఎఫ్ సంఘం నాయకులు ఎస్ .నాగార్జున, రైతు సంఘం నాయకులు వక్కలగడ్డ శివ శంకర్ , కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి వి .మరీ దాసు తదితరులు పాల్గొన్నారు

# కార్మికులకు ఉపాధి కల్పిస్తాం: విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు

**(విన్యూస్, చేబ్రోలు) :** వలస కార్మికులకు, వడ్లమూడి ప్రాంతంలోని వివిధ వర్గాల ప్రజలకు తమ యూనివర్సిటీలో గల వివిధ విభాగాలలో ఉపాధి కల్పిస్తామని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో వడ్లమూడి ప్రాంతంలోని సుమారు 600 పేద కుటుంబాలకు, కార్మికులకు నిత్యవసర సరుకులను బుధవారం విజ్ఞాన్స్ సంస్థల తరుపున శ్రీకృష్ణదేవరాయలు అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వైరస్ వల్ల విధించిన లాక్‌డౌన్‌లో పేదలు ఆకలితో అలమటించకూడదనే ఉద్దేశ్యంతో నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో సమీప ప్రాంత ప్రజలు పనుల కోసం ఇతరత్రా ప్రాంతాలకు వలస వెళ్లకుండా యూనివర్సిటీలో పనులు చేసుకోవాలని సూచించారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో పేద ప్రజలను ఆదుకోవడంతో పాటు, వారిలో ఆత్మస్థైర్యం నింపడానికి విజ్ఞాన్స్ సంస్థలు ఎప్పుడూ ముందంజలో ఉంటాయని పేర్కొన్నారు. ప్రజలు అనవసరంగా బయటకు వెళ్లకూడదని, ఇంట్లో పిల్లలను, వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. కరోనా వైరస్ వీరిపైనే ఎక్కువ ప్రభావం చూపించే అవకాశం ఉందన్నారు. చేతులను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవడంతో పాటు సామాజిక దూరం పాటించాలని తెలియజేసారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, విజ్ఞాన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదరణ కర్త ప్రామిస్ పౌండేషన్ వితరణ




**(విన్యూస్, పెదన) :** కరోనా వైరస్ వల్ల లాక్ డౌన్ నేపథ్యంలో చాలా మంది రోజువారి పనులు చేసుకునే కూలీలు ఉపాధి కోల్పోయిన నేపథ్యంలో తమ వంతు సహాయంగా నిత్యవసర సరుకులు వారి రక్షణ కోసం మాస్కులు పంపిణీ చేసినట్లు పి జె పి ఎఫ్ చర్చి వారి ఆదరణ కర్త ప్రామిస్ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు ఈ మేరకు ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ పట్టణంలో గల కొంత మంది నిరుపేదలకు నిత్యవసర సరుకులు వారి రక్షణ కోసం మాస్కులు అందించడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో పాస్టర్ శామ్యూల్ బాలకృష్ణ నల్ల నాగలక్ష్మి డేవిడ్ రాజ్ ప్రామిస్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# పేదలకు భోజన పొట్లాలు పంపిణీ

**(విన్యూస్, పొన్నూరు) :** స్థానిక లయన్స్ క్లబ్ నేత కోట వెంకటేశ్వర్లు వెంకట రమణ దంపతులు బుధవారం తమ పెండ్లి రోజును పురస్కరించుకుని పేదలకు విస్తృతంగా భోజనాలు వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. స్థానిక సద్గురు సాయిబాబా మందిరం, రైల్వే స్టేషన్లలో



ముమ్మరంగా భోజనాలు కల్పించారు. వారి కుమారుడు కోట సుధీర్ జన్మదిన వేడుకలను కూడా పేదలతో కలిసి జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్,లయన్స్ క్లబ్ ల నేతలు పవన్,సుధీర్, అనిల్,చక్రవర్తి తదితరులు సహకరించారు.

# ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

**(విన్యూస్,కొత్తగూడెం) :** కొత్తగూడెం నియోజకవర్గం సుజాతనగర్ మండలం సింగభూపాలెం గ్రామపంచాయతీ పరిధిలో 2వరోజు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగాసీతారాములు 100రోజుల ఉపాధి హామీ పని కూలీలుని ఉద్దేశించి మాట్లాడుతూ ఎండలు పెరుగుతున్న కారణంగా వడదెబ్బ తగలకుండా ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కరోనా మహమ్మారి రాకుండా భౌతిక దూరం పాటించాలని, మాస్కులు ధరించాలి అని కోరారు. ఉపాధి కూలీలు కొందరు ఇంతవరకు పని చేసిన బిల్లులు రాలేదని తెలియజేసిన వెంటనే అక్కడికక్కడే ఫీల్డ్ ఆఫీసర్ తో పోన్ లో మాట్లాడి బిల్లులు వెంటనే ఇవ్వాలని ఎండలు కారణంగా ఉదయం పూట పని వేళలు మార్పులు చేయాలని కోరటం జరిగింది. 500 మందికి మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. చింతలపూడి రాజశేఖర్, తాళ్ళూరి శ్రీనివాస్ రావు, పైడా ప్రసాద్, రాచబంటి బాబు, యాలాద్రి,నలగొర్ల మల్లయ్య సాల్మన్, అబీద్, నాగరాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# 350 మంది పేదలకు ఆహారం పంపిణీ

**(విన్యూస్, పెడన రూరల్) :** బేరాక మినిస్ట్రీస్ మచిలీపట్నం వారు కిరణ్ పాల్ ఆహారాన్ని 350 మంది పేదలకు ఆహారం అందించారు. కరోన మహమ్మారి వల్ల ఎటువంటి పనులు లేక తీవ్ర ఇబ్బందులు



పడుతున్న పేద ప్రజలకు ఆహారం దొరకడం కూడా కష్టంగా ఉంటుందన్నారు. పెడన లో పలు కాలనీ లతో పాటు పేదలు ఎక్కువ ఉండే ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి ఆహారాన్ని అందించారు.

# బాధిత కుటుంబానికి నగదు అందజేత

**(విన్యూస్, పామర్రు) :** నియోజకవర్గ పరిధిలోని కూచిపూడి ప్రభుత్వ మద్యం దుకాణాంలో పనిచేసే వ్యక్తితో అదే దుకాణం లో పని చేసే వారితోఘర్షణ పడి అనుమానస్ప దంగా మృతి చెందిన కుటుంబ సభ్యులను ఆదుకునే నిమిత్తం వారికి ఇచ్చిన హామీ మేరకు బుధవారం ఎమ్మెల్యే కై లే



అనిల్ కుమార్ రూ 5 లక్షల రూపాయల నగదు ను మృతి ని ఇంటి వద్ద అతని కుటుంబ సభ్యులకు అందజేశారు. దీనితో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సాయం త్వరితగతిన అందించినందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో అపార్ట్ నేతలు పాల్గొన్నారు.

# హ్యూమన్ రైట్ మిషన్ చేస్తున్న సేవ కార్యక్రమాలు అభినందనీయం

**(విన్యూస్, హనుమాన్‌జంక్షన్) :** ప్రపంచంలో కరోనా విజృంభిస్తున్న సమయంలో ప్రతి ఒక్కరూ మానవత్వంతో ప్రవర్తించాలనే ఉద్దేశంతో రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కమిషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంపత్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ జి ఎస్ కుమార్,జనరల్ సెక్రటరీ జాన్ బాబు ఆదేశాల మేరకు హ్యూమన్ రైట్ మిషన్ చేస్తున్న సేవ కార్యక్రమాలు అభినందనీయమని పలువురు వ్యక్తలు కొనియాడారు. పశ్చిమగోదావరి జిల్లా పెదపాడు మండలం అప్పనవీడు గ్రామంలోని ఆశాజ్యోతి వికలాంగుల పాఠశాలలో 60 మంది విద్యార్థులకు అన్నదానం మరియు నిత్యవసర సరుకులు పండ్లు పంచిపెట్టారు. హ్యూమన్ రైట్స్ మిషన్ వెల్ఫేర్ సెక్రెటరీ మూల్పూరి హరీష దాతృత్వంతో ఈ కార్యక్రమం జరిగింది .ఈ కార్యక్రమంలో జిల్లా హ్యూమన్ రైట్స్ ప్రెసిడెంట్ పి ఎస్ రావు జనరల్ సెక్రటరీ అడప సాయిబాబు, పెదపాడు మండలం వైఎస్ఆర్సిపి అధ్యక్షులు అప్పన ప్రసాదు, బాపులపాడు మండల వైకాపా అధ్యక్షుడు దూట్ట శ్రీమన్నారాయణ,యువజన నాయకులు దూట్ట రవి శంకర్,హ్యూమన్ రైట్స్ మిషన్ జిల్లా ప్రోగ్రాం సెక్రటరీ అంకమ్మబాబు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా హ్యూమన్ రైట్స్ మిషన్ సభ్యులు ఆశాజ్యోతి స్కూల్ చైర్మన్ వెంకటస్వామి సెక్రటరీ మాధవీలత కలిసి వికలాంగులకు భోజనం వడ్డించారు.

# నిరుపేదలకు నివేసనా స్థలాలు ఇవ్వాలి:సి పి ఐ.




**(విన్యూస్, పొన్నూరు) :** నిరుపేదలకు పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో నివేసనా స్థలాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం పొన్నూరు మండలం ములుకుదురు గ్రామంలో పేదలకు నివేసనా స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గ్రామ పార్టీ ఆధ్వర్యంలో మౌన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా పొన్నూరు నియోజకవర్గ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి షేక్ గౌస్ దీక్షల నుద్దేశించి మాట్లాడుతూ అర్హులైన పేదలకు పట్టణ ప్రాంతంలో ఒక్కొక్కరికి 3 సెంట్లు,గ్రామీణ ప్రాంతాలలో 2 సెంట్లు చొప్పున ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్లు లేని పేదలకు సెంటు స్థలం ఇచ్చేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు నేపథ్యంలో సీపీఐ ఒక ఉద్యమాన్ని ముందుకు తీసుకెళు తుందన్నారు. లబ్ధిదారులు తమ పూర్తి మద్దతు ఇచ్చి ఉద్యమాన్ని ప్రోత్సహించాలని కోరారు. దీక్షలు చేపట్టిన వారిలో షేక్ గౌస్ తో పాటు ములుకుదురు గ్రామ పార్టీ కార్యదర్శి బుల్లి వెంకటేశ్వర్లు,ముద్రబోయిన వెంకటేశ్వర్లు, తాడిశెట్టి శివ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వలస కూలీలు క్వారెంటీన్ కు తరలింపు



**(విన్యూస్, పొన్నూరు) :** పొన్నూరు మండలం అరేమండ గ్రామంలో 15 మంది వలస కూలీలను క్వారెంటీన్ కు తరలించి వైద్య పరీక్షలు జరిపిస్తున్నారని పొన్నూరు తహశీల్దార్ డి.పద్మనాభుడు బుధవారం విలేఖరులకు తెలిపారు. వెండికొండవారు మండలం విసదల గ్రామం నుంచి అరేమండ గ్రామానికి వ్యవసాయ పనులు నిమిత్తం వలస వచ్చారు.అలా వచ్చిన వారిని ముందస్తు జాగ్రత్తలు కోసం అరేమండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో ఏర్పాటు చేసిన క్వారెంటీన్ కు వైద్య పరీక్షల కోసం పంపినట్లు తెలిపారు. మన్నవ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సిబ్బంది క్వారెంటీన్ లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

# 25వ వార్డులోని 500 నిరుపేద కుటుంబాలకు కూరగాయలు పంపిణీ



**(విన్యూస్, నరసరావు పేట) :** నరసరావుపేట పట్టణం 25వ వార్డులోని 500 నిరుపేద కుటుంబాలకు విజ్ఞాన్ సంస్థల తరుఫున నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు బుధవారం కూరగాయలు పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమాన్ని వాలంటీర్లు, మున్సిపల్ సిబ్బంది సాయంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ నిరుపేదలకు సాయం అందించటంలోనే నిజమైన ఆనందం దాగి ఉంది. మనుషుల మనో సంకల్ప బలం ముందు కరోనా ఓడిపోయాల్సిందేనన్నారు. ఇలాంటి ఆపద కాలంలోనే ప్రతి ఒక్కరూ సేవాభావంతో చేతనైనంత సహాయ సహకారాలు అందించాలి అన్నారు. కరోనా వల్ల విధించిన లాక్‌డౌన్‌తో నిరుపేద జీవితాలు ఆర్థిక బాధలతో ఇబ్బందిపడుతున్నాయి అన్నారు. నరసరావుపేట పూర్తి రెడ్‌జోన్‌లో ఉన్నందున ప్రజలకు ఇబ్బంది లేకుండా కూరగాయలను పంపిణీ చేస్తున్నామన్నారు.

ఇప్పటికే వైద్య సిబ్బందికి, పోలీసులకు, వాలంటీర్లకు, మీడియా మిత్రులకు విజ్ఞాన్ సంస్థల తరుపున మా వంతుగా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మున్ముందు దాతలు సహకారంతో ఈ దానాలను మరింత విస్తృతం చేస్తాం. నరసరావుపేట ప్రజలు తప్పనిసరిగా కరోనాకు సంబంధించిన అన్ని జాగ్రత్తలు పాటించి సురక్షితంగా ఉండాలి. ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల వైస్ చైర్మన్, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# భర్త వేదింపుతో భార్య ఆత్మహత్యాయత్నం



**(విన్యూస్, నెల్లూరు) :** భర్త వేదింపులు తాలలేక భార్యా మంజులా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలలోకి వెల్లగా బోగోలు మండలం సుందరగిరి వారి కండ్రిక కు చెందిన గంపా సురేష్ ,మంజుల గత తొమ్మిది సంవత్సరాల క్రితం వివాహం చేసుకోగా.వీరికి ఇద్దరు బిడ్డలు పుట్టారు వీరి కాపురం గత కొద్ది సంవత్సరాలు అన్యున్యంగా కొనసాగింది .అనంతరం భర్త సురేష్ ,అత్త అలివేలమ్మ ఆడబిడ్డలు నిత్యం వేదింపులకు పాల్పడుతూ రకరకాలుగా కష్టాలు పెడతున్నారని భాదితురాలు మంజుల వాపోయింది. అయితే గత రెండు సంవత్సరాలుగా ఇలానే కొనసాగుతుండగా అనేక పర్యాయాలు మా పుట్టింటికి వెల్లిపోవటం కూడాజరిగిందని తెలిపారు. అయితే మరలా ఇరువురు పెద్దల సమక్షంలో రాజీ కుదుర్చుకుని కాపురం చేసుకుంటుండగా మరలా వేదింపులకు పాల్పడుతూ నీవు ఎక్కడైనా చావు లేకపోతే మేమే చంపేస్తామని బెదిరిస్తూ మంగళవారం ఇంట్లోనే నా భర్త సురేష్ అత్త అలివేలమ్మ ఇద్దరు కలసి నన్ను కర్రలతో చితకబాదారని నీవు చావు మేము నా కొడుకుకు రెండో పెళ్లి చేసుకోవాలని కొట్టగా ఆ దెబ్బలు భరించలేక పురుగుల మందు తాగి ఆత్మాహత్యకు పాల్పడినట్లు మంజుల తెలిపారు. అయితే నేను పురుగుల మందు తాగినా వారెవరు నన్ను రక్షించలేదని మా మామ ఇతరులు నన్ను కావలి ప్రభుత్వ హస్పటల్ కు తరలించి వైద్యం చేయించారని తెలిపారు. అయితే ప్రస్తుతం బాదితురాలు మంజుల ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. అయితే నా భర్త మా అత్త , ఆడబిడ్డల నుంచి నాకు ప్రాణహాని ఉందని నన్ను నా బిడ్డలను రక్షించాలని బాదితురాలు మీడియా ముందు వాపోయింది. పోలీసులు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి చొరవతో కేరళలో చిక్కుకున్న అంధులు తమ స్వస్థలాలకు రాక

**(విన్యూస్, పులివెందుల) :** కేరళలో బిక్షాటనకు వెళ్లి లాక్‌డౌన్ కారణంగా కేరళ రాష్ట్రంలో చిక్కుకున్న అంధ బిక్షాటకులను ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి చొరవతో కేరళ రాష్ట్రం లో చిక్కుకున్న కడప జిల్లా వేంపల్లి ఫక్కిరు పల్లె కు చెందిన అంధులను ఆంధ్రాకు పంపినట్లు కేరళ ప్రభుత్వం వెల్లడించింది. వారిని కడప క్వారంటైన్ కు తరలించి కోవిడ్ టెస్టులు అనంతరం 14 రోజుల తరువాత స్వస్థలాలకు పంపించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందుకు సహకరించిన ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, మరియు జడ్పీటీసీ ఎమ్. రవి కుమార్ రెడ్డికి అంధ కుటుంబ సభ్యులు మరియు వేంపల్లి ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

Owned by EDITOR and Publisher: PREM NATH THOKALA, 26/152, Buttaipet, Machilipatnam, Krishna Dist.,Printed at Sri Lakshmi Ofset Printer binders, D.no : 32-26-126/13, opp BSNL Bhavan, Chuttagunta, Vijayawada-4. ph:08672 227347.,cell 9848667347 - RNI NO: APTEL/2015/65279